ఆర్త నాదం

"సిగ్గూలజ్జా లేదు ముండకి. బరి తెగించింది. ఎవరికొంప తీస్తాదో: ఎవరి పీకల మీదికి తెస్తాదో!" అన్నం గిన్ని అరిగిపోతుందేమోనని సుతారంగా తోముతూ పెద్దగా స్వగతం చెప్పుకుంటోంది అప్ప లమ్మ.

వంటింట్లో ఉల్లిపాయలు కోస్తోన్న రాధకి ఆ రెండు మాటలూ వినిపించాయి. "ఎవర్ని అప్పలమ్మా, అలా దీవిస్తున్నావు?" అంటూ కళ్ళు తుడుచుకుంటూ బయటికొచ్చింది.

"కన్నమ్మ ముండమ్మా!" గిన్ని అవతల పారేసి హుషారుగా చేతులు తిప్పుతూ — "ఇందాక రైలుకింద పడతానని పిల్లోణ్ణెత్తుకుని బద్దీలమద్దిన నిలుచుం దంట! గేంగు కూలీలు కూకలేసి తగిలేశారంట! నేనైతే ముండని రైలుకిందకే గెంటేదాన్ని" — ఇనుమడించిన ఉత్సాహంతో గిన్ని అందుకుంది.

"ఏం? ఎందుకు పడుతుంది రైలు కింద? ఏం కష్టమొచ్చిందో నీకేం తెలుసు?"

"ఊరుకోమ్మా, నువ్వు మరీనూ! అదో ఎత్తు. జిత్తులమారి ముండ!"

".... కన్నమ్మంటే నీ కెందుకంత కోపం? పాపం ఎప్పుడూ తిడతావు...."

"కోపంకాక మరేంటమ్మా? చెడిపోయినముండ!"

వారంరోజుల నుంచీ ఏకవరసగా తిట్టిపోస్తోంది అప్పలమ్మ, ఆ కన్నమ్మని.

కన్నమ్మ ఎక్కణ్ణుంచో వచ్చిందట! ఇల్లిల్లూ అడుక్కు తింటోందట! అలా వున్నట్టే వుండి ఇళ్ళకి నిప్పెడుతుందట! అంటే, మొగవాళ్ళని వల్లో వేసు కుంటుందట. వారం రోజులనుంచీ ఊదర కొట్టినట్టు చేప్తూనేవుంది అప్పలమ్మ.

రాధ, ఆ మాటలేమీ పట్టించుకోలేదు. కన్నమ్మ ఎప్పుడూ రాధ గుమ్మంలోకి రాలేదు. కన్నమ్మంటే అప్పలమ్మకి ఎందుకంత కోపమో అర్థం కాలేదు — "సరేలే, గిన్నిలు తొందరగా తీసుకురా!" అని వంట గదిలోకి వెళ్ళిపోయింది.

"ఇదిగో! తోముతున్నానమ్మా! నాలుగిళ్ళ పని చేసి చేసి చేతులు మంటలు పుడుతున్నాయి. నాకు సాగ దమ్మా అంటే ఇనవు. నా పనే కావాలంటావు" అని స్వగతాలు చెప్పుకుంది అప్పలమ్మ.

ఆ రోజు మధ్యాన్నం కొత్త పత్రికలు చదువు కుంటూ నిద్రలోకి జారిపోయింది రాధ.

మిట్టమధ్యాన్నం .... ఒంటిగంట దాటింది. ఎండ మిడిసి పడుతోంది. ఎవరో వీధితలుపు కొడుతూన్నట్టు విన్పించింది. కీచుగొంతుకతో చంటిబిడ్డ ఏడుపు కూడా!

ఉలిక్కిపడి లేచింది రాధ. గబగబా వెళ్ళి తలు పులు తీసింది. గుక్కపట్టి ఏడుస్తోన్న పిల్లాణ్ణి చేతుల్లో పెట్టుకుని కొయ్య బొమ్మలా నిలబడివుందా మనిషి. నల్లటి నలుపు — పొట్టి — స్ఫోటకం మచ్చలు — నిమ్మకాయంత ముడి — ఒళ్ళంతా కప్పని బారెడు గుడ్డ — కాళ్ళదగ్గర నల్లటి సంచి — కళ్ళనిండా నీళ్ళు!

"ఎవరు నువ్వు? ఏం కావాలి?" — నిద్రమత్తులో కూడా విసుక్కోకుండానే అడిగింది రాధ.

ఆ మనిషి గబుక్కున కళ్ళు తుడుచుకుంది. గుటక మింగి బొంగురు కంఠంతో "అమ్మా! పిల్లోడు సచ్చిపోతాడేవో భయంగా వుంది. పొద్దుట్నుంచి కడుపులో కేమీలేదు. ఎందర్నో అడిగాను. పో పొమ్మ న్నారు. ఒక్క అణా డబ్బులియ్యి తల్లీ!" — ఆ పాఠం ఎందరికో చెప్పినట్టు గడగడా చెప్పేసింది. కళ్ళల్లో నీళ్ళు జలజలా రాలిపడ్డాయి.

ఆ పిల్లాడు చేతుల్లో వుండటం లేదు. గింజు కుంటున్నాడు. మూడు నెలల కంటే ఎక్కువ వుండవు. మొహాన్నిబట్టి అనుకోవటమేగానీ కాళ్ళూ, చేతులూ పుల్లల్లా వున్నాయి.

రాధకి చాలా జాలేసింది — "డబ్బులిస్తాను గానీ నువ్వు పాలు కొని పట్టేసరికి చాలా ఆలస్యం అవు తుంది. మా ఇంట్లో పాలున్నాయి. వెచ్చబెట్టి ఇస్తాను. లోపలికి రా!"

ఆ మనిషి అలాగే నిలబడింది తెల్లబోయి.

"ఫర్వాలేదు. అదుగో, అలా వాకిట్లోంచి వెళ్ళు. పెరటివేపు వరండాలో కూర్చో, పాలు తెస్తాను."

రాధ లోపలికి వెళ్ళి, స్టౌ వెలిగించి — పాలూ నీళ్ళూ కలిపి వెచ్చబెట్టి పంచదార కలిపి గ్లాసులో పోసి తీసుకువచ్చింది.

పిల్లాడు ఏడ్చే వోపిక లేక తల్లి చేతుల్లో వాలి పోయి కునుకుతూ పడుకున్నాడు.

"ఎలా పోస్తావు పాలు? చిన్న చెంచా ఇవ్వనా?"

"ఒద్దమ్మా! నా దగ్గర సీసా వుంది" అంటూ ఆ మనిషి సంచిలోంచి రంగుసీసా తీసింది.

పిల్లాడిని తల్లి ఒళ్ళో పడుకోబెట్టుకుని పాలు పడు తోంటే రాధ పీటతెచ్చి వేసుకుని కొంచెం దూరంగా కూర్చుంది.

పిల్లాడు ఆవురావురుమంటూ పాలన్నీ తాగేశాడు. ఒళ్ళోనే నిద్రపోయాడు.

గచ్చుమీద ఓ పాతగుడ్డ పరిచి వాణ్ణి పడుకో బెట్టింది ఆ తల్లి — "అమ్మా! కొంచెం ఈ కోకగుడ్డ పిండుకుంటాను. తడిపేశాడు. చెంబుతో కాసిని నీళ్ళిస్తారా?" అంది.

"అదిగో! ఆ స్నానాల గదిలో పంపు వుంది, వెళ్ళు. సుబ్బరంగా ఉతుక్కో" దారి చూపించింది రాధ.

ఆ మనిషి చుట్టుకున్నది రెండు బారల గుడ్డ. అదంతా తడిసి ఒంటికి అంటుకు పోయింది. తడిపిన చెంగు ఎండలో ఆరబెట్టి తనూ ఎండలో కూర్చుంది. ఎండ నిప్పులు చెరుగుతోంది. అంత ఎండలో కూర్చున్న మనిషి మలమలా మాడిపోవాల్సిందే!

"నీ సంచిలో ఇంకో చీర లేదూ?" రాధ వరం డాలో నిలబడి అడిగింది.

"లేదమ్మా! రెండు కోకలుండేయి. పురుడయ్యాక చిరిగిపోయాయి. ఫర్వాలేదు లేమ్మా! అదే ఎండి పోతది."

రాధ లోపలికి వెళ్ళి పాతగుడ్డలపెట్టి తీసింది. చిరుగులుపట్టిన చీరెలు నాలుగు ఉన్నాయి. తెల్లంచు నల్లచీరా, చుక్కలచీరా తీసి బయటికి తీసికెళ్ళింది. ఎండలో కూర్చున్న మనిషి దగ్గిరికి వాటిని గిరాటు పెడుతూ — "ఒక చీర కట్టుకో. ఆ గుడ్డ విప్పేసి ఎండలో పడేసి ఇలా రా! కొంచెం అన్నం వుంది, తింటావా?"

"మీ దయ తల్లీ!"

తెల్లంచు నల్లచీర కట్టుకుంటే ఆ మనిషికి ఎంత కళ వచ్చిందో! పెన్నిధి దొరికినంత తృప్తి కనిపించింది మొహంలో!

అన్నం, పప్పూ ఓ విస్తరాకులో పెట్టి తీసుకొచ్చింది రాధ.

నాలుగు ముద్దల్లో తినేసిందా మనిషి. విస్తరాకు పారేసి వచ్చి చేతులు కడుక్కుంది.

"అమ్మా! కాస్సేపిక్కడ నడుం వాలుస్తాను. పిల్లోడు లేచాక తీసుకుపోతాను."

"అలాగే పడుకో. ఆ సంచి తలకింద పెట్టుకో. అన్నట్టు నీ పేరేమిటి?"

"కన్నమ్మండీ!"

"కన్నమ్మా?" అని రాధ ఆశ్చర్యపడింది. "కన్న మ్మవి నువ్వేనా?" అని రెట్టించింది.

కన్నమ్మ లేచి కూర్చుంది.

"పడుకో, పడుకో! ఊరికే అడిగాన్లే."

రాధ లేచి లోపలకి వచ్చేసింది. పడుకుంటే నిద్ర పట్టలేదు.

పది నిమిషాల్లో వెళ్ళి చూసేసరికి తల్లీ పిల్లాడూ స్పృహతప్పి పడివున్న వాళ్ళలా నిద్రలుపోతున్నారు.

ఈ కన్నమ్మని అప్పలమ్మ తిట్టనిరోజు లేదు చెడ్డ ముండట!

మూడు గంటల వేళ కన్నమ్మకి మెలకువ వచ్చింది.

రాధ అంట్లగిన్నెలన్నీ వాకిట్లో పడేసింది. అప్ప లమ్మ ఇంకా రాలేదు. "మళ్ళీ దీనికేమైందో! అబ్బబ్బ, ప్రాణాలు తీసేస్తోంది. ఎప్పుడు విరగడౌతుందోగానీ...." అని చిరాకు పడుతూ రాధ బియ్యం ఏరటానికి కూర్చుంది.

కన్నమ్మ వూడిపోయిన జుట్టు దులిపి ముడేసు కుంటూ— "నేను కడుగుతాలేమ్మా" అంటూ లేచింది.

ఆ పూట అప్పలమ్మ రానేలేదు. పనంతా కన్నమ్మే చేసింది. గిన్నెలు అద్దాల్లా తోమింది. ఇడ్లీ పప్పు కాటు కలా రుబ్బింది. గదులన్నీ సుబ్బరంగా తుడిచింది. మధ్యాన్నం రాధ విప్పిన బట్టలు ఉతికి ఆరేసింది.

ఒక పని తర్వాత ఒక పని అడిగి అడిగి చేసింది.

పిల్లాడు రెండోసారి కూడా పాలుతాగి హాయిగా పడుకున్నాడు.

రాధ మనసు కొత్త ఆలోచనలు మొదలుపెట్టింది.

కన్నమ్మలాంటి పనిమనిషి వుంటే బాగుండును.

వేడి వేడి ఉప్మా, ప్లేటులో పెట్టి కన్నమ్మ కిచ్చింది.

పిల్లలు ముగ్గురూ బళ్ళోంచి వచ్చి వరండాలో పడుకున్న పిల్లాడి చుట్టూ చేరారు. వాళ్ళ ప్రశ్నలకి జవాబులు చెప్పేసరికి నీరసం వచ్చింది రాధకి.

"పాపాయి పేరేంటమ్మా?"

"నాకూ తెలీదు. వాళ్ళమ్మ నడగండి" అంది రాధ.

కన్నమ్మ నవ్వి — "ఎంకడు బాబూ! తిరపతెంకన్న పేరు" అని చెప్పింది పిల్లలకి. వాళ్ళతో కబుర్లాడుతూ కాస్సేపు కూర్చుంది. తర్వాత లేచి పిల్లాణ్ణి భుజం మీదేసుకుని సంచి చేత్తో పట్టుకుంది— "ఎళ్తానమ్మా!"

"ఎక్కడికి?" అప్రయత్నంగా అడిగింది రాధ. తమాయించుకుంటూ — "అన్నట్టు మీ ఇల్లెక్కడా? అసలెక్కడుంటున్నావూ?" అంది దీర్ఘం తీస్తూ.

"ఎక్కడా లేదమ్మా! ఏ పూటకేతల్లికి దయకలిగితే ఆరింట్లో."

"అసలు మీదేవూరు?"

"ఈ ఊరు కాదమ్మా! శానా.... దూరం లెండి."

"ఈ పిల్లాడి బాబెక్కడున్నాడు?"

కన్నమ్మ జవాబు చెప్పలేదు. అంత వరకూ చెప్పిన జవాబులు కూడా ఇష్టం లేనట్టుగానే చెప్పింది.

"నువ్వేనా పొద్దున్న రైలుకింద పడిపోతానని నించున్నావటా?.... ఇంత చంటి గుడ్డుని పెట్టుకుని అదేంపని కన్నమ్మా?" మందలింపుగానే అంది రాధ.

కన్నమ్మ కళ్ళల్లో నీళ్ళూరాయి — "బతకలేనోళ్ళు చావకేం చేస్తారమ్మా?"

"అయితే మాత్రం? నాలుగిళ్ళలో పని చేసుకునైనా బతకొచ్చు. నీకేం లోటు?"

"కనికరించి ఆ ముక్క మీరన్నారు. ఈ ఇళ్ళమద్దె కొచ్చిన కాణ్ణించీ పిచ్చికుక్కని తరిమినట్టు తరిమెయ్యాలని చూస్తన్నారు. ఆ యమ్మోమాటా, ఈ యమ్మోమాటా! కష్టపడి బతుకుదామనే వచ్చాను. రోజు గడచేలాగ లేదమ్మా! పేణం ఇసిగి పోతంది."

"సరేలే. ఈ పూటకింకెక్కడి కెళ్తావు? చీకటిపడి పోతోంది. రేపు చూద్దాం. పిల్లాడిని పడుకోబెట్టు. చూడు! ఆ తెల్ల గిన్నినిండా నీళ్ళుపట్టి తీసుకురా! ఎసరు పడేస్తాను" రాధ వంటింట్లో కెళ్ళింది.

కన్నమ్మ, సంచి కిందపెట్టి పిల్లాణ్ణి పడుకోబెట్టేసింది.

పిల్లలు ఎంకడిచుట్టూ చేరారు.

రాధ, పాతగుడ్డలన్నీ వెతికి, సందెడు గుడ్డలు పట్టుకొచ్చి చాప పక్కన పడేసింది. "కన్నమ్మా! ఇవ్వన్నీ పిల్లాడికి వాడుకో" అని, మళ్ళీ వెతికి ఒక గుడ్డ సంచి తెచ్చి పడేసింది. "ఆ బట్టలన్నీ ఇందులో పెట్టుకో" అంది.

కన్నమ్మ మొహంలో ఆనందం చూడాలి! పాత గుడ్డలు దొరికినందుకు అంత ఆనందమా! అదా బతుకు!

రాత్రి భర్త వచ్చాక, రాధ కన్నమ్మ గురించి చెప్పింది — "పాపం.... ఎవ్వరూ లేరట. మనిషి మంచిదిలా వుంది. పనులన్నీ శుభ్రంగా చేస్తోంది. అప్పలమ్మతో నా ప్రాణం విసిగిపోతోంది. నెలకి పదిసార్లయినా నాగాలు పెడుతుంది. ఏ పని చెయ్యమన్నా పుట్టెడు కోపం. పొద్దుటే చూడండి.... టిఫిన్లూ, కాఫీలూ.... మీకు ఆఫీసూ, పిల్లలకి స్కూలూ .... అన్నీ తరుముకుంటూ వస్తాయి...." ఎడతెరిపి లేకుండా మాట్లాడుతోన్న రాధ వాగ్ధాటికి అడ్డుపడుతూ సత్యన్నారాయణ "అబ్బబ్బ! ఎందుకీ దండకం రాధా? అసలు కబురేమిటో చెప్పు!" అన్నాడు.

"ఏంలేదు. కన్నమ్మని మనింట్లో వుంచుకుందామా?"

"నీ ఇష్టం. కావాలంటే ఉంచుకో."

"దానికి కొంచెం దిక్కు చూపించినట్టూ వుంటుంది. బొత్తిగా చంటి పిల్లాడితో ఇల్లిల్లూ తిరుగుతోంది. అందుకనీ...."

"అలాగే. ఇందులో మనకి తరిగిపోయేదేమీలేదు. ఇంట్లో మనిషి వుంటే నీకు చాలా సాయంగా వుంటుంది. అన్నీ ముందుచెప్పి జాగ్రత్తగా వుండమని చెప్పు" సత్యన్నారాయణ గదిలోకి వెళ్ళిపోయాడు.

రాధ పొంగిపోయింది.

కన్నమ్మకి అన్నం పెడుతూ నవ్వుతూ అంది — "కన్నమ్మా! నీ కెక్కడా ఇల్లూ వాకిలీ లేదన్నావు. పోనీ

మా ఇంట్లో వుండి పోరాదూ?"

కన్నమ్మ తలెత్తి ఆశ్చర్యంగా చూసింది.

"కన్నమ్మా! ఈ లక్ష రూపాయల మూట అందుకో రాదూ?" అంటే ఎలా వుంటుంది?

"అదేమిటి? మాట్లాడవేం?" అంది రాధ.

కన్నమ్మకి ఆనందంతో దుఃఖం వచ్చేసింది — "అమ్మా! దేవుడే నన్ను మీ గడపలోకి తెచ్చి పడేశాడు. ఈ అన్నం మీద ప్రమాణం. ఇస్వాసంగా మసలు కుంటాను. మీ మేలు మర్చిపోనమ్మా! నా బిడ్డ సాష్షి!"

"ఛ! ఏవిటా ఒట్లు? కష్టపడే వాళ్ళకి ఏదో ఒక దారి దొరుకుతుంది. దానికేం భాగ్యం?.... పిల్లాడికి పాలు ఈ చెంబుతో వుంచుతాను. నీకింకా అన్నం కావాలా?"

"ఒద్దమ్మా! కడుపు నిండిపోయింది."

రాధ గదిలోకెళ్ళి కన్నమ్మ పడుకోటానికో చాపా, పాత దుప్పట్లు రెండూ తెచ్చి ఇచ్చింది. వంట గది సర్దుకుని, పిల్లాడికి పాలు పట్టమని కన్నమ్మని హెచ్చరించి, పడుకోటానికి వెళ్ళిపోయింది.

★ ★ ★

మర్నాడు చీకట్నే అప్పలమ్మ దబ దబా తలుపులు బాదుతోంటే అంట్లు తోముతోన్న కన్నమ్మ లేచివెళ్ళి తలుపులు తీసింది.

దెయ్యాన్ని చూచినట్టు బెదిరింది అప్పలమ్మ.

రాధ గుమ్మం దగ్గరికొస్తూ — "అప్పలమ్మా! నీకు ఖాళీలేదనీ, మనిషిని చూసుకోమనీ చెపుతూనే వున్నావుగా? కన్నమ్మని కుదుర్చుకున్నాము. తర్వాత మీ అబ్బాయిని పంపించు. డబ్బులు చూసి ఇచ్చేస్తాను" అంది.

"అదేంటమ్మా! ఒక్కపూట రాలేదని.... నా చేతిలో పని ఆ ముండకిస్తావా?"

"చీకట్నే ఎందుకా కేకలు? నేను రమ్మంటేనే వచ్చి పని చేస్తోంది. దాన్నెందుకు తిడతావు?.... రోజుకో పూట ఎగ్గొడతావు. నీతో నా కెలా కుదురుతుంది? చాలుగాని వెళ్ళు."

"ఎళ్తాలేమ్మా! నా నోటి దగ్గర కూడు లాక్కుని ఆ ముండెన్నాళ్ళు తింటదో తినమను. దాని జిమ్మడా! దానికి పొయ్యేకాలం రానూ! దాని బిడ్డ బూడిదవ్వా!" అంటూ చేతులు ఝాడిస్తూ మెటికలు విరిచింది.

రాధ తలుపులు వేసేసి మొహం కడుక్కోటాని కెళ్ళిపోయింది.

అప్పలమ్మ రంకెలు వినపడుతోనే వున్నాయి కన్నమ్మకి.

కన్నమ్మ వచ్చి వారం దాటింది.

గదులు తుడుస్తూ దొరికిన డబ్బులు తెచ్చి ఇచ్చేసింది — రెండు మూడుసార్లు.

ఓసారి రాధ బల్లమీద చెవి దుద్దులు మర్చిపోతే జాగ్రత్తగా పట్టుకెళ్ళి ఇచ్చింది — "అమ్మా! నా కర్మ కాలి ఇయ్యెక్కడన్నాపోతే నామీదే వుంటది అనుమానం. కొంచెం జాగర్తగా వుంసుకోండమ్మా!" అంది భయపడుతూ.

ఆ వారం రోజుల్లోనూ కన్నమ్మ కథ కూడా వింది రాధ.

కన్నమ్మకి మొట్టమొదట ఒక పెళ్ళయింది. ఇద్దరు కొడుకులు కూడానూ. ఐదారేళ్ళు మొగుడూ పెళ్ళాలు సుఖంగానే వున్నారు.

"నీ మొగుడు మంచివాడేనా?" అంది రాధ అడ్డుతగిలి.

"కోపంవొస్తే చితకబాదేవోడు గానీ చాలా మంచోడమ్మా!"

"చితకబాదేవాడు మంచోడా?" అంది రాధ ఆశ్చర్యపోతూ కోపంగా.

"పోనీలేమ్మా! కట్టుకున్నాడు ఒక దెబ్బేస్తే తప్పేంటి లేమ్మా? ఏం చేసినా ఆడికే చెల్లు. ఆడే వుంటే నాకీ తిప్పలెందుకు తల్లీ?"

కన్నమ్మ మొగుడు ఏదో జబ్బుచేసి చచ్చిపోయాడు. పిల్లలిద్దర్నీ పెట్టుకుని పుట్టింట్లోనే వుండేది కన్నమ్మ. తల్లీ తండ్రీ లేరు. అన్నా వదినా వున్నారు. ఆ వదిన వాతలు మాత్రం పెట్టలేదు గానీ నానాపాట్లూ పెట్టింది. కన్నమ్మకీ పిల్లలకీ కడుపు నిండా తిండి పెట్టేదికాదు, పెట్టడానికి మాత్రం తిండెక్కడుంది? పోనీ మాటైనా చల్లగా మాట్లాడేది కాదు.

ఒకరోజు కన్నమ్మ అన్న ఒక సంబంధం తీసుకొచ్చాడు. కన్నమ్మకి మళ్ళీ పెళ్ళి చేసుకోవాలని లేదు. కూలో నాలో చేసుకుని, పిల్లల్ని పెంచుకుంటూ

బతకాలని వుంది. కానీ, ఎవణ్ణో ఒకణ్ణి కట్టుకోకపోతే ఈ వదిన గారెన్నాళ్ళో బతకనివ్వదు. అయినా అన్న తెచ్చిన సంబంధం, కన్నమ్మకి బొత్తిగా ఇష్టంలేదు. అరవై యేళ్ళుదాటి జబ్బులతో బాధపడుతోన్న వాణ్ణి కట్టుకునేకన్నా, వయసులో వున్న అప్పన్ననే చేసుకో వచ్చుగా? — అనుకుంది.

అప్పన్న కన్నమ్మా వాళ్ళకి దూరపు చుట్టం. మొదటి పెళ్ళాం పోయింది. పిల్లల్లేరు. కన్నమ్మతో చాలాసార్లు పరాచికాలాడబోయాడు. కన్నమ్మ విసిరి కొట్టింది. అయినా వెంటబడి తిరుగుతూనే వున్నాడు.

"అప్పన్ననే చేసుకుంటాను" అంది కన్నమ్మ వాళ్ళన్నకి చాలా కోపం వచ్చింది. తిట్టిపోశాడు.

కన్నమ్మ ఒక రాత్రి పిల్లల్ని వదిలేసి అప్పన్న ఇంటికి వెళ్ళిపోయింది. అప్పన్నకి తల్లీతండ్రీ వున్నారు. తల్లికి పక్షవాతం. తన పనులు తను చేసుకోగలదుగానీ ఎప్పుడూ మంచంలో పడి వుంటుంది. ఇంట్లో కూడొండే వాళ్ళు లేరు. కన్నమ్మ రావటం వాళ్ళకి ఇష్టమే. గప్‌చిప్‌గా అప్పన్నకీ, కన్నమ్మకీ గుళ్ళో పెళ్ళి చేసేశారు.

రాధ ఆశ్చర్యపోతూ "పిల్లల్ని వదిలేసి వెళ్ళావా? అదేం పని కన్నమ్మా? పిల్లలే లేకపోతే ఆ మొగు డెందుకూ? పడుచు మొగుడు దొరికితే చాలను కున్నావా?" అంది గబగబా కోపం ఆపుకోలేక.

"నేను చేసిన బుద్ధితక్కువ పని అదేనమ్మా!" అంది కన్నమ్మ తలవాల్చేసి.

"అప్పన్నతో పెళ్ళయిపోయాక నిమ్మళంగా మా అన్న కోపం పోతుందనుకున్నాను. పిల్లల్ని తెచ్చేసు కుందా మనుకున్నాను. నెల్లాళ్ళు పోయాక 'పిల్లల కోసం ఎళ్తాను' అంటే అప్పన్నేవన్నాడో తెలుసామ్మా? — 'పిల్లలూ వొద్దు, పీసూవొద్దు. ఆళ్ళనెవరు మేపు తారు, తిండి దండగ' అని కసిరికొట్టాడు...."

"మా బాగా అన్నాడు" అంది రాధ వొళ్ళుమండి పోయి. "అతనితో మొదటే మాట్లాడుకోవద్దా? నా పిల్లల్ని నాతో వుంచు కోకుండా వొదిలిపెట్టను —అని మొదటే చెప్పొద్దా? దానికి ఒప్పుకుంటేనే వాడి దగ్గిరికి వెళ్ళాలి. లేకపోతే నీ బతుకు నువ్వు బతకాలి. ఎందు కొచ్చిన మొగుళ్ళు, వెధవ మొగుళ్ళు!"

"అదేనమ్మా నేను చేసిన బుద్ధిలేని పని. మొదట అడిగితే వొప్పుకోడు కదా, నెమ్మదిగా అడగొచ్చులే — అనుకున్నానమ్మా! నాకెవరూ సెప్పినోళ్ళు లేరు. నా బుర్రకి అలా తోసిందమ్మా! తర్వాత ఎంత ఏడిస్తే ఏం లాభం? ఎంత బతిమాలినా వొద్దన్నాడమ్మా! కాళ్ళా ఏళ్ళాపడి ఏడిశాను. పిల్లల్ని చూడకపోతే బతకలేనని తిండి మానేసి పడుకున్నాను. 'అయితే ఒకసారెల్లి చూసిరా' అన్నాడు. పిల్లల్ని ఎంటబెట్టుకుని వొచ్చేద్దా మని ఒక సందేళ బయల్దేరి మా అన్నింటి కెల్లానమ్మా! ఇలా గడపలో కాలెట్టానో లేదో పిల్లలిద్దరూ నన్ను చూసి అన్నం గిన్నిలు వొదిలేసి బావురుమంటూ నా కాళ్ళకి చుట్టేసుకున్నారు. వలవలా ఏడ్చేశాను. లోప ల్నించి యముళ్ళా వచ్చాడు మా అన్న. పిల్లలిద్దర్నీ చెరో రెక్కా పట్టుకుని ఈడ్చుకు పోయాడు. నోటికిరాని బూతులు పేలాడు. ఇప్పుడు కావల్సి వచ్చారంటే పిల్లలూ — అని తిట్టాడు. గడపలోంచి ఈధిలోకి గెంటే శాడు నన్ను. ఎప్పుడన్నా గుమ్మంలో అడుగెడితే కత్తి కొక కండలాగ నరికేతానన్నాడు. పిల్లల్ని తెచ్చుకుందా మంటే ఈడొప్పుకోడు, ఇమ్మంటే ఆడివ్వడు. నేనేం చెయ్యనమ్మా?" అని కాస్సేపు ఏడ్చింది.

"మొదటే చాలా తప్పు చేశావు కదా? అలాగే అంటారులే. పోనీలే, నీ అన్న దగ్గర సుఖంగానే వున్నారుగా?"

"ఏం సుకవమ్మా! పిల్లల్ని చితకబాదేసే వోడు. అయినా గుండె రాయి చేసుకుని వూరుకున్నానమ్మా! ఒక్కేడాది ఎలాగో గడిసింది. అప్పన్న రిక్షాబండి లాగే వోడు. తాగుడు బాగా నేర్చేసుకున్నాడు. నెత్తీనోరూ బాదుకున్నాను. ఇన్నాడు కాదు, రేత్తుర్లు ఇంటికే వొచ్చేవోడుకాదు. ఆడికర్మ ఆడిదని వొదిలేశాను.

మా అత్తకి కుసింత బాగయిందమ్మా. నేనొచ్చిన యేళ మంచిదనేది. నా బతుకు అలాగా సాగలేదమ్మా!

ఒకనాడు అప్పన్న ఇంటికి రాలేదు. మా మావం అర్ధరాత్రి నా పక్కలోకొచ్చి కూకున్నాడు. కంగారెత్తి పోయాను. ఈధిలోకి పరిగెత్తాను. తెల్లార్లూ గుమ్మం ముందే పడుకున్నాను. చీకట్నే వచ్చాడు అప్పన్న....

"అతనికి చెప్పేశావా లేదా?...." ఆత్రుతగా అడి గింది రాధ.

"చెప్పేశానమ్మా! మీ అయ్య ఇలా చేశాడు — అని ఏడ్చేశాను. 'ఏడిశావులే. మా అయ్య మంచోడు'

అని తూలుకుంటా లోపలికి పోయాడు. మిట్ట మధ్యాన్నందాకా బండలా పడుకుని నిద్దరోయాడు. లెగిసే సరికి మా మావ ఐదు రూపాయల నోటు అందించాడు కొడుక్కి. మా మావకి సారాకొట్టుంది. బాగా సంపాదించేవోడు. అస్తమానూ కొడుక్కి డబ్బిచ్చేవోడు.

తరవాత ఒక వారం రోజులు మా మావ నా వూసురాలేదు. మల్లా ఆడికేం బుద్ధి పుట్టిందో.... ఇంట్లో నా మొగుడూ వున్నాడు, మా అత్తా వుంది, వచ్చి నా దగ్గిర కూకున్నాడు. గుసగుస లాడటం మొదలెట్టాడు. నేను బెదిరిపోయి ఎర్రికేక లేసేశాను. నా నోరు నొక్కేశాడు. ఏడవటం మొదలెట్టాను. నా మొగుడు లెగిసిరాడే! తెగతాగి పడి వున్నాడు. మా అత్త సరేసరి. అది తెలిసే ఊరుకుంది. పైగా మంచంలో పడుకుని "నోరుముయ్యే ముండా! ఎదవగోలా నువ్వూను" అని ఒక్క కసురు కసిరింది.

"నా మాటినను. ఆ జులాయి ఎదవని నమ్ముకుని ఏం బావుకుంటావు?" అని బతిమాలటం మొదలెట్టాడు మా మావ.

నేను దెయ్యంలా కూర్చున్నా. నాకేవీ తెలవలేదు. ఏడుపుకూడా రాలేదు."

"మీ అత్తకూడా ఎందుకిలా చేసింది?" అంది రాధ తెల్లబోతూ.

"తరువాత తెలిసిందమ్మా నాకు. అది దానికిష్ట మైన వోళ్ళతో పోయేది. మొగుడు చూసీ చూడనట్టూరు కునేవోడు."

"అలాగా?...." రాధ ఆశ్చర్యపడింది.

కన్నమ్మ కొంచెం నొచ్చుకుంటూ — "ఎందు కమ్మా, ఇలాంటి కవుర్లు మీలాంటోరు ఇనకూడదు. పాపిష్టి బతుకులు మాయి."

"అబ్బే, అందుక్కాదు, చెప్పు! నీ అత్తా మావా బాగానే వున్నారు. నువ్వే నాశనం అయ్యావు. నీ మొగుడి కెలా బుద్ధిలేదూ?"

"ఆడికి బాబు నెదిరించే ధయిర్యం లేదమ్మా! ఏదో వొంకపెట్టి నన్ను చావ బాదుతుండేవోడు. తాగి నప్పుడు దగ్గిరి కొచ్చేవోడు. తెలివిగా వుంటే ఇసిరికొట్టే వోడు. మా మావకి మరీ అలుసై పోయింది."

"కన్నమ్మా! అలాంటి నరకం ఎలా భరించావు? మీ అత్తకి బాగయింది కదా? నీ మొగుడూ నువ్వూ వేరే కాపరం పెట్టుకుని వుండొచ్చుగా?"

"అలాగే చెప్పానమ్మా! ఆడి చెవి కెక్క లేదు. ఇంటి కొచ్చేసరికి కక్కా ముక్కా వుడకేసి పెట్టేది అమ్మ. అర్ధో రూపాయో ఇచ్చేవాడు బాబు. ఉప్పు తేవాలని లేదు, పప్పు తేవాలని లేదు. పెళ్ళాం ముండ వుండనే వుంది పక్కలోకి. ఏబ్రాసిలాగ తిని తిరిగేవోణ్ణి ఏరే సంసారం పెట్టమంటే ఇంటాడా? ఆడి అనూ పానూ తెలవకుండా అణ్ణి కట్టుకోటం నా వొళ్ళు పొగరు. రామ లక్ష్మణుల్లాంటి బిడ్డల్ని వొదులుకున్నాను. నా పాపం నేను అనుభవించొద్దా అమ్మా?"

"పిల్లల్ని ఎప్పుడైనా చూస్తూ వుండే దానివా?"

"నెల్లాళ్ళకో రెన్నెల్లకో — ఏ బజార్లోనో తారసపడే వోరు. అస్తమానం కనపడితే బెంగ పెట్టుకుని ఏడుస్తారని నేనే తప్పుకునే దాన్ని. ఆళ్ళిద్దరూ మా అన్న దగ్గిర బాగానే వున్నారు. ఈ మూడో పిల్లోడు కడుపులో పడ్డాకేనమ్మా నా బతుకు బజారుకెక్కింది. ఈ కబురు చెప్పబోతే చీదరించుకున్నాడు నా మొగుడు.

"కడుపొచ్చిందంట, కడుపు. నీకూ నాకూ ఏం సమ్మందం? ఎవడి దగ్గరికి పోతావో పో" అన్నాడు.

ఆ మాటల్తో మా మావకి కోపం వొచ్చింది. "ఏంరా పేల్తన్నావ్? దాన్ని కట్టుకున్నది నువ్వా, నేనా?" అన్నాడు.

"అది నీకే తెలవాలి" అని కస్సుమన్నాడు కొడుకు. ఇద్దరూ మాటామాటా అనుకుని కలబడి తన్నుకోబోయారు. ఆళ్ళూ ఈళ్ళూ వొచ్చి ఇడదీశారు. ఆ రేత్రికి రేత్రి ఇంట్లోంచి ఎళ్ళిపోయాడు నా మొగుడు. ఒక నెల్లాళ్ళయినా తిరిగిరాలా. మా అత్తకి నేను ఇంట్లో వుండటం ఇష్టం లేదు. "ఇంకా ఇక్కడే మొగుడున్నా డని కూచ్చున్నావే?" అని తిట్టి పోసేది. ఆ ఇంట్లో వుండటం నా కిష్టం లేనేలేదు. ఇంకెక్కడికెల్లను? దారీ తెన్నూలేదు.

మా అత్త ఒకరోజు మా మావా నేనూ గదిలో వుండగా బయట గొళ్ళెం పెట్టి పది మందినీ కేకలేసి — రెండు చేతుల్తోటి జుట్టుపీక్కుని ఏడుస్తూ — "చూశారా, చూశారా? ఈ ముండ .... నా మొగుణ్ణి తగులుకుంది. ఇంతన్యాయం ఎక్కడన్నా వుందా?.... మీరన్నా బుద్ధిచెప్పండి" అని అరవటం మొదలెట్టింది.

అందరూ నన్ను పురుగుని చూచినట్టు చూశారు "నీకేం పొయ్యేకాలం? కళ్ళు పోతాయే" అన్నారు. తలోమూలా దుయ్య బట్టేశారు. "నా ఇంట్లో ఉంటానికి ఈల్లేదు. ఎక్కడికి పోతావో పో" అని మా అత్త నా కొప్పట్టుకుని బయటికి గెంటి కోకలు తెచ్చి మీద పడేసింది.

నేనక్కడే కూలబడ్డాను. ఎవరి దార్ని ఆళ్ళు పోయారు.

"మళ్ళీ మీ అన్న దగ్గరకే వెళ్ళక పోయావా?" అంది రాధ జాలిపడుతూ.

"ఎల్లానమ్మా! నాకింకెవరున్నారు? ఆడు నన్ను చంపేసినా మంచిదే అని ఎల్లాను. ముందు నా గుమ్మం దిగి నించోమన్నాడు."

"అబ్బ! అంత కఠినంగా ఉండాలా? మనిషికి జాలీ దయా ఉండక్కర్లేదూ?"

"నాకు నిజం మీ కబద్దం. మా అన్నలాంటి కర్కోటకు డెక్కడా వుండడు. నన్ను ఇంట్లోకి రానిచ్చి పీకపిసికి చంపేసినా బాగుండునమ్మా!"

"మరి ఎక్కడికెళ్ళావు?"

"గంగమ్మ అనీ ఒకావిడ ఆళ్ళింటికి రమ్మని చేరదీసింది. గంగమ్మకి పిల్లల్లేరమ్మా! ఎప్పుడో రెండు కడుపులొచ్చి పోయినాయంట. తరవాత మనిషి వూరి పోయింది బండలాగయింది. పిల్లలు పుట్టరని డాట్టర్లు కూడా చెప్పినారంట.... అందుకని మొదట్లో నన్ను కనికరించి చేరదీసినా తర్వాత్తర్వాత.... నాకు పుట్టే పిల్లనో పిల్లోణ్ణో తను పెంచుకోవాలని ఆలోచించుకుంది. నన్నూ అడిగింది — 'అంతకంటేనా? నేను మాత్రం ఏంటెట్టి పెంచుతానూ? అలాగే తీసుకో' అన్నాను.

అప్పట్నించీ ఆ మొగుడూ పెళ్ళాలు నన్ను బాగానే చూసేవోళ్ళు. ముందు నాకు కూడెట్టేది. బజార్నుంచేదో వొకటి తెచ్చి చేతిలో పెట్టేది. ఇక్కడ చీపురు పుల్లక్కడ పెట్టనిచ్చేది కాదు. కన్నబిడ్డని చూసినట్టు చూసిందమ్మా! గంగమ్మ మొగుణ్ణి 'అన్నా' అని పిల్చేదాన్ని. ఆడుకూడా 'చెల్లెమ్మా' అనేవోడు. భగవంతుడు నన్ను సల్లగా చూశాడనుకున్నాను.

కన్నమ్మ చెప్తూనే వుంది. రాధ ఆలోచనల్లో మునిగింది — కన్నమ్మ చెప్పకుండానే తర్వాతేవయిందో తెలుసుకోవాలని. ఎవళ్ళో చేరదీశారంటోంది. ఈ పిల్లాడేవిటి, ఈ వీధులట్టుకు తిరగటం ఏమిటి?

"పిల్లాణ్ణి గంగమ్మ కివ్వలేదా?" అంది గబుక్కున.

కన్నమ్మ ఎందుకో దిగాలు పడిపోయి వూరుకుంది. "అమ్మా! ఏంటి సెప్పమంటారు? నాకు నిజం, మీ కబద్దం. ఇల్లు దాటి బయటికెల్లిన ఆడదంటే గుడ్డ విప్పుకుని బజార్లో తిరిగే దాన్తో సమానం. అది మంచి ముండా, చెడ్డ ముండా అని సూడదు. రాబందు పీక్కు తిన్నట్టు పీక్కు తినాలని ఎగబడతారు.

కడుపుతో వుంటే మాత్రం కాళ్ళు సాపుక్కూర్చుంటే జరుగుద్దా అని ఏదో ఒక పనిలో కెల్లే దాన్ని. అమ్మా! ఈ ప్రెపంచకంలో నాలాంటి ఆడ ముండ కెక్కడ దిక్కుంది! నే నేటంత అందగత్తెనా? మిడిసిపడి పోతన్నానా? అసలు మొగోళ్ళకి అందవూ అక్కర్లేదు, చందవూ అక్కర్లేదమ్మా! ఎవతో ఒకతి ఆడది కావాలి. కూలి పనిలో కెల్తే యజమానులు, తాపీ పనిలో కెల్తే మేస్త్రీలు, పొలంపనిలో కెల్తే కావందులు — ఇక్కడేంటి అక్కడేంటి, ఈళ్ళేంటి ఆళ్ళేంటమ్మా .... మొగోడి అండలేని ఆడది ఎవడికో ఒకడికి తలొంచాల గానీ.... లేకపోతే బతకలేదు. పిచ్చికుక్కని తరిమినట్టు తరువుతారు — ఒక్క మాటినమ్మా! 'అన్నా, అన్నా!' అని పిల్చేదాన్ని. 'ఏంటి సెల్లెమ్మా' అనేవోడు— అలాంటోడు, గంగమ్మ మొగుడేంచేశాడో తెలుసామ్మా? పురుడొచ్చేదాకా వూరుకున్నాడు. బాగానే పుట్టాడు పిల్లోడు. గంగమ్మ ఈణ్ణి మురిపెంగా చూసుకునేది...."

కన్నమ్మ ఏం చెపుతుందో అని రాధకి భయం మొదలైంది.

"నెల్దాటిందో లేదో ఒకనాడు గంగమ్మ ఎక్కడికో ఎల్లింది. సందాలగ్గాని రానని సెప్పింది. నేనొంటిగా వుండాను. పిల్లోడికి నీళ్ళోశాను. ఆణ్ణి పక్కలో ఏసుకుని పడుకున్నాను. కునుకట్టింది. మెలుకువొచ్చి సూద్దును గదా ... ఆడు ... జుట్టుమీద సెయ్యేసి తల దగ్గర కూకుని నవ్వుతున్నాడు.

నా వొళ్ళు జల్లుమంది. "ఇదేంట్రా అన్నా?" అంటానే కంగారుపడి లేసిపోయాను. ఆడింకా దగ్గిర కొచ్చాడు — "అది రాదు లేయే! ఏంటి బయం?" అన్నాడు. నాకంతా అర్థమయిపోయింది.

పుట్టెడు దుక్కం వొచ్చేసింది "అన్నా! అన్న

వనుకుంటున్నాన్రా! నా కళ్ళు పోతాయిరా!" అన్నా.

"ఓస్! కళ్ళెందుకు పోతాయే! ఒకమ్మకి పుట్టామా, ఒకబ్బకి పుట్టామా? పిలుచుకుంటేనే తోడబుట్టినోళ్ళం అయిపోతామేంటే?" అన్నాడు.

నేను ఏడుస్తా కూకున్నాను. ఆడి వుషారంతా పోయింది. నా మీద కోపం వొచ్చింది. "ఏంటే కన్నమ్మా! సీతమ్మోరిలా మాట్టాడతావేంటే? నీ మావకన్నా తీసిపోయానేంటే?" అన్నాడు. ఎటకారం చేశాడు. నే నొప్పుకోలా. దగ్గిర కూకుని నెమ్మదిగా నాకు నచ్చ చెప్పాలని సూశాడు. "నా దగ్గిరుంటే నీకేవీ లోటుండదే! కూడూ గుడ్డా పూచీ నాది, నా మాటినే! తప్పులేదే! నీకు మాత్రం వయసులేదా? ఉప్పు కారం తింటం లేదా? మారు మనువు కులపోళ్ళం మనం. ఎవడు కాదంటాడే?" అని సెప్పుకొచ్చాడు.

"అన్నా! నీకు దణ్ణం పెడతాను. నా వూసెత్తకు. మీరే తల్లీదండ్రీ అనుకుని మీ పంచన పడున్నాను. నీ కన్న కూతుర్ననుకో. నీ అప్పచెల్లెల్ననుకో. నీ కాళ్ళకి దణ్ణం పెడ తాను. నా బిడ్డ మొకం చూడు..." అని బావురుమని ఏడుస్తూనే ఆడి కాళ్ళట్టు కున్నాను.

ఇసురుగా ఇదిలించుకుని బయటికి పోయాడు. కుప్పలా కూలబడి అలాగే పడి వున్నాను.

సందాలకే గంగమ్మొచ్చింది. 'గంగప్పా' అని దాన్ని చుట్టబెట్టుకుని ఏడ్చేద్దావనుకున్నాను. "ఏంటైంది కన్నా?" అని అదడిగితే ఏం చెప్పాల? ఆళ్ళిద్దరూ కుమ్ములాడు కుంటారు. తెలిసో తెలవకో వాగాడు ఎధవ, పోన్లే. ఆడి పాపం ఆడిదే. ఆళ్ళ కాపరంలో నేనెందుకు సిచ్చుపెట్టాల? ఆడి తప్పు ఆడే తెలుసు కుంటాడు .... అని నాలో నేను సెప్పుకుని వూరు కున్నాను.

"ఏంటే కన్నమ్మా, అలాగున్నావ్?" అంటే, "ఏంటీ లేదే! నిద్దరోయాను" అన్నాను. "నీ మొకం సంతకెల్లా! నీకేం పొయ్యేకాలవే? పచ్చి బాలింతరాలివి. పట్ట పగలు నిద్దరోతావా? వాతం కమ్ముకొస్తే ఏంటవు తావే?" అంటా కూకలేసింది గంగమ్మ.

అంత మంచి మనిషి గంగమ్మ. దాని కడుపులోది తీసి నా కడుపులో పెట్టేది. నా పిల్లోణ్ణి చూసుకుని నాకన్నా ఎక్కువ అదే మురిసిపోయేది.

"అమ్మా! అలాంటి దానికి నామీద కోపం వచ్చి తన్ని తగిలేసిందంటే నా రాత కాకపోతే మరేంటి?"

కన్నమ్మ చెప్పేదంతా రాధకి కొత్త ప్రపంచంలా వుంది. పనిపాటలు చేసుకుంటూ బతికే వాళ్ళంతా ఇష్టం వచ్చినట్టు తిరుగుతారనీ, వాళ్ళకి మంచీ చెడ్డా వుండవనీ ... ఎందుకో అలా అనుకునేది రాధ కాని... ఈ కన్నమ్మ?

"అయ్యో, గంగమ్మ కెందుకు కోపం వచ్చిందీ?" అంది ఆతృతగా.

"దాని కేంటిలేమ్మా! ఎవళ్ళకైనా కోపం వస్తది. అసలు తప్పునాది. నా మనసులో ముక్క దాని చెవులో వూదేశాను కాను. ఆ ముక్కే అదీ అడిగింది 'నువ్వంత ఇల్లాలివైతే మొదట్లోనే నాకెందుకు చెప్పలేదూ?' అని నిలదీసడిగేసింది. గంగమ్మకి నేను చెప్పకపోటమే ఆడికీ లోకువైపోయింది. నాకిష్టం వుండే బెట్టు చేస్తన్నాననుకున్నాడు. చూడమ్మా! ఎలా గొచ్చిందో కత."

"అయ్యో! పిచ్చిముండా!" అనుకుంది రాధ. "వాడు మళ్ళీ ఏవైనా అన్నాడా?" అంది పైకి.

"మల్లా ఏంటమ్మా? నించోనిచ్చాడా, కూకో నిచ్చాడా? గంగప్ప కనుమరుగైతే సాలు, నా కొంగట్టుకులాగే వోడు. చెయ్యట్టుకు గిల్లేవాడు. ఏం చెయ్యాలో తోచేది కాదు. గంగప్ప చూస్తాదని బయం. మీ కబద్ధం, నాకు నిజం. గుప్పిట్లో పేణాలెట్టు క్కూకున్నా ననుకోండి. — 'పాపం' ఎన్నాళ్ళు దాగు ద్దమ్మా? బళ్ళున బద్దలవదా? ఒకనాడు ... సందేల ... చీకటి చీకటిగా వుంది. పగలప్పుడు దొడ్లో బీరపాదు ఎనకాల దడిమీద పిల్లోడి గుడ్డలారేశాను గాలికి. గుడ్డలు తెద్దాం కదాని అటెల్లాను. ఎనక్కి తిరిగి చూద్దును గదా, ఈడు! అమాంతం కావిటేసుకున్నాడు. "ఇదిగోనే! రయికలగుడ్డ కొనుక్కోయే!" అంటా రూపాయిబిళ్ళ నా గుప్పిట్లో పెట్టాడు.

దేవుడో, ఇదేం ప్రారబ్దంరో అని నా కాళ్ళు గజగజ వొణికిపోయాయి. నోట్లో నుంచి మాట రాలేదు. పిచ్చి పట్టిన ముండలాగ నించున్నాను ... అదుగోనమ్మా! అప్పుడే ... చూసేసింది గంగమ్మ. ముందు తెల్ల బోయింది. తరవాత వురిమి చూసింది. తల తాటిం చింది. గబగబా ఇంట్లో కెల్ళి పోయింది. దాన్ని చూడ గానే వుండేలు చూసిన కాకిలాగ మాయమయ్యాడు

ఎదవ. నే నొక్కదాన్నీ చిక్కిపోయాను — బిక్కచచ్చి నించున్నాను.

లోపలికెళ్ళిన గంగమ్మ పిల్లోణ్ణి తీసుకొచ్చి నా కళ్ళముందు మట్టిలో పడేసింది — "నాకు పిల్లా వొద్దూ, పీచూ వొద్దూ తల్లీ! ఇలా బతకనియ్యి. నీ దారిన నువ్వు దయచెయ్యి" అనేసింది మండిపడి పోతా.

"అప్పా" అని దాని కాళ్ళమీద పడి పోయాను — "నా మాటనమ్మే అప్పా! నేనే పాపం ఎరగనే! దేవుడి తోడే! నే నెప్పుడూ ఒప్పుకోలేదే!" అని ఎంత చెప్పినా నమ్మదే!

"ఛీ, ముండా! రంకు నేర్చిందానివి బొంకనేరవ్వా? నీ లొసుగు లేకుండా ఆడు నిన్ను కావిటేసుకున్నాడా? ... ఎంత గుండెల్దీసిన బంటువే! ఇశ్వాసం వుందంటే నీకు? కన్నోళ్ళూ, కట్టుకున్నోళ్ళు — తగిలేస్తే చేర దీశానే ముండా! నా కడుపు కట్టుకుని నిన్ను మేపానే ముండా! కుక్కన్తీసుకొచ్చి సిమ్మాసనం ఎక్కించానే ముండా! 'చెల్లెమ్మా! చెల్లెమ్మా' అని పిలిసేవోణ్ణి లొంగదీసుకుంటావా? కళ్ళు పేలిపోతాయే! కుష్టు రోగంతో కుళ్ళిపోతావే! ..." — ఒక మాట కాదు, ఒక తిట్టుకాదు. గుండెలు కవికేలా రంకెలేస్తా ఏం పేలిందో పేలింది.

మట్టిలో దొల్లుతూ పిల్లోడి ఏడుపు. గంగప్ప తిట్లు! — బొట్టెట్టి పిలిచినట్టే మూగేశారు మూక — "ఏంటే గంగమ్మా?" అని దాన్ని పలకరింపులు. నా గుప్పిట్లో రూపాయి నా గుప్పిట్లోనే వుంది. పారేస్తే నిజంగా తప్పుడు ముండనంటారని అలాగే పట్టుకున్నాను.

నా చెయ్యి లాగి రూపాయి బిళ్ళ అందరికీ చూపించేసింది గంగమ్మ — "సూడండల్లా! మీరందరూ బాగా సూడండి! ఎన్నాళ్ళ నుంచి సాగుతా వుందో అడగండి! ఈ ముండకి నోటినిండా గడ్డెట్టెండి!" అని బుగ్గపోట్లు పొడిసింది.

నా మాట ఇన్నవాళ్ళు వొక్కళ్ళూ లేరు. కాకుల్లా పొడిచేశారు.

"ఇంకా కొయ్యిలా నిలబడ్డా వెందుకూ? దారి పట్టు" అంది గంగమ్మ చేతులు జాడిస్తానే. నా మీద నమ్మకం పోయింతర్వాత దాని గడపలో రోజులెలా గడుపుకోను? మొగుడలాగ — పెళ్ళామిలాగ!

"పిల్లోణ్ణి తీసేసుకో గంగప్పా! ఒక్క దాన్నీ ఎటో పోతాను" అన్నాను ధయిర్యం తెచ్చుకుని.ససేమిరా ఒప్పుకోలేదు. ఏడ్చాను. మొత్తుకున్నాను. ఒద్దుగాక వొద్దంది. అప్పుడాణ్ణి భుజంమీద పడేసుకుని పుట్టెడు చీకటి నెత్తినేసుకుని బయట పడ్డాను ... చేతిలో రూపాయి పురు గులా గుందమ్మా! ఇసిరి పారేద్దామను కున్నాను గానీ, కళ్ళ కద్దుకునీ బొడ్లో దోపు కున్నాను.

అదే నా కాదారం. అది ఆ పూటే అయిపోయింది. పిచ్చెత్తిన్దానిలాగ తిరుగుతా వుంటే, ఒక ముసలాయన తన గుడిసిలో వుండనిచ్చాడు. పది రోజులు గడిశాక, మా వూళ్ళో వాళ్ళతో పడి ఇటేపొచ్చానమ్మా! ఎక్కడన్న పని దొరుకుద్దనుకున్నానమ్మా! కాకిలాగ తిరుగుతున్నాను .... పేణానికి ఇసు గొచ్చేసిందమ్మా! రైలు కిందబడి సద్దామనుకున్నాను. రైలు గమ్మునొత్తె ఆ పూటే అంతా అయిపోనమ్మా! ..." కన్నమ్మ కళ్ళలోంచి నీటిబొట్లు బొట బొటా రాలి పడ్డాయి. చెప్పిన చరిత్రంతలోనూ సగం మాటలు ఏడుస్తూనే చెప్పింది. చెప్పలేక కొంత కొంతసేపు ఊరుకుంటూ వూరుకోలేక ఏడుస్తూ చెప్పింది.

రాధ వారించలేదు. ఏడవనిచ్చింది. ఏడవటం కూడా మానేస్తే ఇక దానికున్నదేవిటి?

"పోనీలే కన్నమ్మా! జరిగిపోయింది తల్చుకుని ఎంతకాలం ఏడుస్తావు? కష్టాలు మనుషులకు కాక పోతే మానులకొస్తాయా? ఊరుకో" అని ఓదార్చింది కొంతసేపటికి.

కన్నమ్మకూడా కొంత తేలిక పడింది — "అమ్మా! రెండు నెల్ల పొద్దయింది, బిడ్డని ఒళ్ళో పెట్టుకుని పక్షి తిరిగినట్టు తిరుగుతున్నాను. కడుపునిండా కూడు లేదు. ఒంటి నిండా గుడ్డ లేదు, రెక్కల కష్టం చేసుకుని బతుకుదావన్నా దారిలేదు. మొగోడి మొకం చూస్తే చాలు భయం పుడతావుంది. ఆడ తల్లుల క్కూడా కనికారం లేదు. మొహం మీద నవ్వినోళ్ళేగానీ పన్నెత్తి పలకరించి నోళ్ళు లేరు. అమ్మా! నేనేనాడు పూజ చేశానో మీ గడప తొక్కాను. తిండీ గుడ్డా దొరికింది. గుండి కుదటపడింది."

కన్నమ్మ చెప్పినదంతా వింది రాధ. ఒక రోజంతా ఆలోచించింది.

"కన్నమ్మా! నేనోమాట చెపుతాను. ఎవడైనా

మంచివాణ్ణి చూసుకుని అతని అండన ఉండి పోకూడదూ? ఎంత కాలం ఇలా గడుస్తుంది నీకు?"

కన్నమ్మ తెల్లబోయింది — ఇంత మంచితల్లి ఇలా చెప్పిందేవిటా అని. కొంచెంసేపు మాట్లాడకుండా కూర్చుంది. "అమ్మా! మంచివాడు దొరికితే అంతకన్నా ఏం కావాలి? ... నీకు తెలవదమ్మా! ప్రపంచకంలో మంచోడెవడు? మొగోళ్ళు, తన తల్లీ తోడబుట్టినోళ్ళూ తప్పితే — మిగిలిన ఆడోళ్ళందరూ తన పక్కలోకి రావాలని వుబలాట పడేవోళ్ళేనమ్మా! తగులుకున్నోడు మొగుడవుతాడా, తాడిచెట్టు నీడవుతాదా అనీ, తగులుకున్నోడు నిరవాకం చేత్తాడా? నాలుగు రోజు లుంచుకుని తన్ని తగిలేత్తాడు. మల్లా నా కడుపూ నేనూ తయారు! లోకులు నా మొహం మీద వుమ్మే త్తారు. ఆ బాధంతా నా కెందుకమ్మా? ఈ మొగోళ్ళని నమ్ముకుని నా వొళ్ళెందుకు గుల్లచేసుకోవాల? నా రెక్కలు నాకున్నాయి, మీలాంటి తల్లులుండరా? ఇయ్యాల గాకపోతే రేపైనా నా గుణం తెలవదా? మీ పాదాల దగ్గిరే పడుంటాను."

ఆహా! మనిషి పశువై పోవలసిన ఎన్నో పరిస్థితుల్లో చిక్కుకుని కూడా ఇంకా ఈ మనిషి మనిషిలా ఎలా వుండగలిగింది?

కన్నమ్మ, ఒళ్ళో పాలుతాగుతోన్న కొడుకుని ముద్దులాడుతూ నవ్వింది — "ఈణ్ణిస్తే ఆరొందల రూపాయలిస్తాననన్న దొకమ్మ... అమ్మో, నా గుండెల్ని కోసుకుంటాగానీ నా బిడ్డ నిచ్చేసుకుంటానా? ఈడికీ నాకూ ఏనాటి సమ్మందవో! అందుకే గంగమ్మ కాబుద్ధి పుట్టింది. పెద్ద కొడుకుల్నిద్దర్నీ వొది లేసుకున్నాను. నాలుగేళ్ళు కష్టపడి ఈణ్ణి పెంచుకున్నానంటే ఈడు పెద్దోడై నన్ను పెంచడా? — ఆనాడు గుమ్మంలో కొచ్చి నిలబడితే మీరీ చంటిబిడ్డని చూసే చేర దీశారు గానీ నేనొక్కదాన్నే అయితే పో పొమ్మనరా? ఈడే నాకు దిక్కమ్మా! ఈడే! చూడండమ్మా! ఎలా నవ్వుతున్నాడో నన్ను చూసి..." — కన్నతల్లి మురిపెం అది!

"ఇంత పసిగుడ్డుని పెట్టుకొని రైలు పట్టాలమీద కూర్చున్నావా ఛస్తానని? నీ దుంపతెగ!" నోటిదాకా వచ్చిన మాటలు ఆపుకుంది రాధ, దాని ఆనందంలో నీళ్ళు చిమ్మలేక.

"అవునుగానీ కన్నమ్మా! మొగోడి మొహం చూస్తేనే భయం వేస్తుందన్నావు కదా? మొగాళ్ళందరూ అంతేనంటావా? పెద్దింటివాళ్ళు కూడా... చదువుకున్న వాళ్ళు కూడా అంతేనంటావా?" కుతూహలంగా అడి గింది రాధ.

"ఏదో వాగేశాను లేమ్మా! అందరూ అలాంటోళ్ళ యితే లోకం తల్లకిందులై పోదా? ... ఎక్కడో వుంటారు రాములోరి లాంటోరు. వుండనే వుండరా?" అని ఎదురు ప్రశ్న వేసింది.

రాధకి చాలా సంతృప్తి కలిగింది — "ఎక్కడో ఏమిటి? నా మొగుడే రాముడు" అందామనుకుంది గర్వంగా. నవ్వి ఊరుకుంది.

నిజానికి రాముడి పాత్ర రాధ కిష్టమైంది కాదు. కానీ, రాముడు ఏకపత్నీ వ్రతుడంటారే! అందుకే మొగుణ్ణి రాముడితో పోల్చుకోవాలనిపించింది.

సత్యన్నారాయణకి, 'చాలా మంచి వాడ'న్న పేరుంది. ఈ 'చాలా మంచితనం', అతని శీలం గురించి కూడా. పరాయి ఆడవాళ్ళతో ఎప్పుడూ చొరవగా మాట్లాడడు. దొంగ చూపులు చూడడు. చెడు సంబంధాలు పెట్టుకోగా ఎవ్వరూ చూడలేదు. "సత్యన్నారాయణా? ... ఈ కాలంలో వుండ దగిన వాడు కాదు" అన్న పొగడ్త చాలా వుంది. అందుకే రాధకి కన్నమ్మ మాటలు చాలా నచ్చాయి. మంచి వాళ్ళే లేకపోతే లోకం తల్లకిందులై పోతుందట! ఈ లోకం, సత్యన్నారాయణ బరువువల్లే తిన్నగా నిల్చుని వుందో ఏమో! నవ్వొచ్చింది రాధకి.

★ ★ ★

అన్ని అనుభవాలతో తలపండిన కన్నమ్మయినా మంచి మొగాళ్ళుంటారని ఒప్పుకుందిగానీ, లీల ఒప్పుకోలేదు.

లీల కాలేజి చదువు అర్ధాంతరం చేసి పెళ్ళి చేసు కుంది. రాధ మరో ఆకు ఎక్కువ చదివి, ఆ పనే చేసింది. వాళ్ళిద్దరూ స్నేహం మర్చిపోలేదు. పరి స్థితులు కూడా కలిసి వచ్చాయి. ఇద్దరూ ఆఖరిసారిగా కలుసుకుని ఏడాది పైనే అయింది. అప్పుడు చాలా కబుర్లు చెప్పుకున్నారు. సంసారాల గురించీ, మొగుళ్ళ గురించీ చెప్పుకున్నారు. కిరస నాయిల్ డబ్బా ఎన్నాళ్ళు వస్తుందో చెప్పుకున్నారు. సంవత్సరానికెన్ని చీరలు చిరుగుతాయో, ఏ చీరలు బాగా మన్నుతాయో, వాదించుకున్నారు. పిల్లలెలా చదువుతున్నారో,

ఎంతెంత తెలివైన వాళ్ళో ముచ్చటించుకున్నారు. అంత వరకూ అతిశయాల్లేకుండా నిజాయితీగానే మాట్లాడుకున్నారు.

"మీ ఆయన మంచివాడేనా?" — హఠాత్తుగా అడిగింది లీల.

"అదేమిటే, కొత్త దానిలా అడుగుతున్నావు? మా ఆయన సంగతి నీకు తెలీదా?" అంది నవ్వి రాధ.

"అది కాదులే. ఈ ఏడాదిలో నీ అమూల్యాభిప్రాయం పరివర్తన చెందిందేమోనని."

"మా ఆయన ప్రవర్తన మారనంత కాలం నా అమూల్యాభిప్రాయం పరివర్తన చెందే ఖర్మేవిటీ? అటు సూర్యుడు ఇటు పొడవాలిగానీ ఆ రెండూ జరగవు."

"అబ్బో! ఏమిటో ఆ గ్యారంటీ?"

"నమ్మకమే. లేకపోతే సంసారాలెలా చెయ్యగలం?"

"మహా చక్కగా చెయ్యొచ్చు. కూడూ, గుడ్డా కోసం సంసారాలు చెయ్యకేం చేస్తాం?"

"ఏడిశావులే. పశువులా మాట్లాడకు. కూడూ గుడ్డా కోసమా పెళ్ళి చేసుకున్నది?"

"మరెందుకటా?"

నవ్వేసింది రాధ — "ఒసే లీలా! మీ ఆయన .... ఎప్పుడో ఏదో చేశాడని .... పాపం నీ దగ్గిర తప్పుకూడా ఒప్పేసుకున్నాడు కదే? ...

"ఆ తప్పే మళ్ళీ మళ్ళీ చేస్తే.....?"

"ఎందుకు చేస్తారేవిటీ? ఆ మాత్రం బుద్ధి వుండదూ?"

"బుద్ధి వుంటే, మొదట మాత్రం ఎందుకు చేస్తారే?"

లీలా వాళ్ళాయన 'తిరుగుబోతు' కాదు గానీ, మొగవాళ్ళ శరీరాలకి అది చాలా అవసరం — అన్నట్టు వాదిస్తూ వుంటాడు.

లీల చాలా చీదరపడుతుంది — "శరీరాలు ఆడ వాళ్ళకీ వున్నాయి. అవసరాలు అన్ని శరీరాలకీ వుంటాయి. అసలు సంగతి అది కాదు. మొగాళ్ళు ఏం చేసినా తప్పులేదని లైసెన్స్ ఇచ్చేశారుగా? అందుకే వాళ్ళు అలా తయారవుతారు. ఆడవాళ్ళకి అలాంటి లైసెన్స్‌లు లేవు కాబట్టి, వాళ్ళని వాళ్ళు అదుపులో వుంచుకుంటారు. అదే మంచిదిలే. ఆడేవిటి, మొగేవిటి, ఎవళ్ళని వాళ్ళు అదుపులో వుంచుకోవడమే మంచిది. అలాగైతేనే, ఒకళ్ళ మీద ఒకళ్ళకి నమ్మకాలుంటాయి. అభిమానాలుంటాయి. జీవితాలు నిలకడగా వుంటాయి. లేకపోతే, ఎవళ్ళ తిరుగుడు వాళ్ళదే అయితే, ఇక ఆ కొంప ఎందుకూ, ఆ సంసారం ఎందుకూ?" అంటుంది.

అతను అదంతా ఎగరగొడతాడు — "నీ మొహంలే నీకు తెలీదులే. మొగాళ్ళకి చాలా అవసరం. ప్రకృతిలోనే అలాగ వుంది. కావాలంటే డాక్టర్లని అడుగు" అని మళ్ళీ మొదటి కొస్తాడు.

లీల, అలాంటి వాదాలన్నీ చేసి చేసి వొదిలేసింది. ఎవళ్ళ వాదం వాళ్ళకే వుండిపోయింది.

లీల, ఆ మాటలన్నీ ఎప్పుడో ఒకసారి రాధకి చెపుతూ వుంటుంది — ఉత్తరాల్లోనో, కలిసినప్పుడో!

అన్నీ విని రాధ — "బుద్ధి లేకండా నడిచే ఆడవాళ్ళ మాత్రం లేరాయేమిటే లీలా?" అంటుంది.

"ఉండరని కాదు. మొగాళ్ళకి హద్దులూ పద్దులూ పెట్టలేదు. ఆడవాళ్ళకి బోలెడు పెట్టారు. అందుకే ఆడవాళ్ళ కన్నా మొగాళ్ళు విచ్చలవిడిగా వుంటారు. ఆడ వాళ్ళు వెనకా ముందూ ఆలోచిస్తారు. అదీ నేననేది."

"నీ మొహం లెద్దూ! పాపం అతని మీద అస్తమానూ కోపమే నీకు? అని నవ్వుతుంది రాధ.

"రాధా! మొగవాళ్ళ గురించి నీకేమీ తెలీదే. వాళ్ళు మనలా వుండరు. ఉండాలని అనుకోరు. ఎవడైనా వుంటే పరిస్థితులు కలిసి రాకేనే రాధా! వాళ్ళు చేసేవి చేస్తోనే వుంటారు. మనం వింటే సహించలేమని మనకి చెప్పరు. నీలాంటిదైతే గుండెపగిలి చచ్చి వూరుకుంటుంది."

"ఏం? నువ్వయితే మాత్రం? మురిసి ముక్కలవుతావా?"

"నేను గుండె రాయి చేసుకోగలనే! నీ బుర్రంత సున్నితం కాదు నా బుర్ర."

లీల మాటలు రాధకేం నచ్చలేదు. కొంచెం కోపం కూడా వచ్చింది — "నీ మాటలే నమ్మమంటావుగానీ నా మాటలకు విలువ ఇవ్వవేం? భార్యల్ని ప్రేమించి జీవితమంతా ఒక్క భార్యతో నిజాయితీగా బతికే మగవాళ్ళు చాలామంది వుంటారు."

లీల నవ్వి "ఎప్పుడైనా నీ మొగుడు నీకు ద్రోహం

చేస్తే కూడా ఈ మాటలే అంటావా?" అంది.

"ఆఁ, అంటాను. లోకం అంటే నా ఇల్లేనా ఏమిటి? నాకు మంచి జరిగితే లోకం అంతా మంచీనూ, నాకు చెడ్డ జరిగితే లోకం అంతా చెడ్డానా?"

లీల ఆశ్చర్యంగా చూసింది — "రాధా! బాగా కోపం వచ్చిందా? నేను మాత్రం మూర్ఖురాలినా? అందర్నీ ఎందుకు శంకిస్తానే? మీ ఆయన చాలా ఉత్తముడని నాకూ తెలుసు. నిన్ను ఏడిపించాలని అన్నాగానీ..."

"మా ఆయన్ని పొగడ్డానికేంలే? ... మీ ఆయన మాత్రం...?"

"నీకు తెలీదులే. ఆయనంటే నాకు గట్టి అనుమానం లేకపోయినా గట్టి నమ్మకమూ లేదు. మనస్సు తెగపీకుతోన్నా పెళ్ళానికి జడిసి మనస్సు మళ్ళించుకుంటే, అది కూడా ఒక మంచితనమేనా? అసలు భార్య మీద ప్రేమవల్ల పరాయి ఆడదాని మీదకి మనసు పోకుండా వుండాలి. ఏం? మనం వుండటం లేదా? అవకాశాలు లేకేనా? మనలా మొగాళ్ళు వుండకూడదూ?"

"అదిగో మళ్ళీ మొదటికొచ్చావ్."

నవ్వింది లీల. మనస్ఫూర్తిగా అంది — "నువ్వు చాలా అదృష్టవంతురాలివే."

రాధకి తన అదృష్టాన్ని తల్చుకుంటోంటే చాలా తృప్తీ, గర్వం కలిగాయి. సుఖపడుతున్నామని తెలిసి సుఖపడటం ఎంత హాయి!

★ ★ ★

కన్నమ్మ వచ్చి మూడు నెలలు దాటింది. పూర్తిగా ఇంట్లో మనిషిలాగ కలిసిపోయింది. ఇంట్లో చాలా పనులు కన్నమ్మే చేస్తుంది. రాధ రెండు పూటలా వంటపని చూస్తుంది. పిల్లల చదువుల సంగతి ఎక్కువగా పట్టించుకోడానికి ఇప్పుడు వీలవుతోంది. చీకట్నే అంట్లు తోమటం దగ్గిర్నుంచీ — ఇళ్ళూ వాకిళ్ళూ, పిల్లలకి రెండు పూటలా స్నానాలూ పానాలూ, బట్టలుతుకూ, మర్నాడు టిఫిన్‌కి పిండి రుబ్బటం — ఇదీ అదీ అనకుండా బద్ధకం ఎరక్కుండా పని వున్నంత వరకూ పూర్తిచేసి కానీ కూర్చోదు కన్నమ్మ. రాధ మందలించినా వినిపించుకోదు. ఎంత సేసినా ఇద్దరికీ ఎప్పుడూ పని వుంటూనే వుంటుంది.

ఇక్కడికి వచ్చినప్పుడు కన్నమ్మ మురికి వోడుతూ వుంది. ఇప్పుడు పని మనిషిలాగ అనిపించదు. తలా వొళ్ళూ బట్టలూ ఎప్పుడూ శుభ్రంగా వుంచుకుంటుంది.

రాధే చెప్పి చెప్పి అలా దారికి తెచ్చింది.

కన్నమ్మ కొడుకు కొంచెం ఒళ్ళు చేశాడు, బోర్లా పడుకుని పొట్టమీద పాకుతూ ఇల్లంతా తిరుగుతున్నాడు.

కన్నమ్మ గురించి అప్పుడప్పుడూ ఒక్కో కబురు చొప్పున చాలా సంగతులు చెప్పింది రాధ సత్యన్నారాయణకి. "పాపం... చాలా చికాకులు పడింది. ఇన్నాళ్ళకైనా మంచి ఇల్లు దొరికినందుకు... 'అదృష్టం' అన్నంత మురిసిపోతోంది."

"మంచి ఇల్లంటే?"

"ఏమో! నాకేం తెలుసు? అది అన్న ముక్క మీతో అన్నాను" అంది రాధ నవ్వుతూ.

"కష్టపడి చాకిరీ చేస్తోందేమో కాస్త నిశ్చింతగా వుంది. లేకపోతే మనం మాత్రం ఆదరిస్తామా?" అన్నాడు సత్యన్నారాయణ.

రెండు మూడు సార్లు వెంకడికి పట్టే పాలు విరిగిపోతే సత్యన్నారాయణ కాఫీకి వుంచిన పాలు ఇచ్చేసింది రాధ. సత్యన్నారాయణేమీ విసుక్కోలేదు. "పోనీలే, చంటిపిల్లాడికి పాలు లేకుండా చెయ్యకు. అంతకన్నా పాపం వుండదు" అన్నాడు. భర్త కారుణ్యానికి ఎంత మురిసిపోయిందో రాధ!

★ ★ ★

వారం రోజులనుంచీ కన్నమ్మకి పొడి దగ్గులా వస్తోంది.

ఒకరోజు రాత్రంతా నిద్రపోకుండా దగ్గుతూనే వుంది. తెల్లారేసరికి జ్వరం తగిలింది. చలి కుదుపు వచ్చింది. అయినా నెమ్మదిగా లేచి పాచిపనులు చేసింది.

రాధ కన్నమ్మకి కాఫీ ఇస్తూ అడిగింది "రాత్రి... నువ్వు చాలాసేపు దగ్గినట్టు న్నావు కదూ? నాకు విన్పి

స్తోనే వుంది.”

“అవునమ్మా! అదే పోద్దని వూరుకున్నాను కర క్కాయన్నా బుగ్గనెట్టుకున్నాను కాను. రేత్రంతా జొరం, చలీ, ఇంకా ఒళ్ళు ఎచ్చగానే వుంది. పొద్దున్న పళ్ళు తోముకుంటంటే నెత్తురు పడిందమ్మా!”

రాధకి కొంచెం కంగారు పుట్టింది. “అయితే తొందరగా తెమిలి డాక్టరుగారి దగ్గిరికి వెళ్ళిరా!”

“అబ్బే! ఎందుకమ్మా! కరక్కాయ....”

“నీ మొహం .... ఈ రోజుల్లో ఏదీ ముదర బెట్టుకోకూడదు — మాకు బాగా తెలిసిన డాక్టరు గారున్నారు. అన్నీ వివరంగా చీటీ రాసి ఇస్తాను, పట్టు కెళ్ళు. ఏవైనా బిళ్ళలు కొనుక్కోమంటే మందుల షాపులో కొను.”

రాధ చెయ్యి ఖాళీ చేసుకుని డాక్టర్‌కి ఉత్తరం రాసింది. కన్నమ్మని పరిచయం చేసింది — “చాలా మంచి మనిషి. ఎవ్వరూ దిక్కులేరు. మా ఇంట్లో వుంటోంది — మీరు కొంచెం శ్రద్ధగా ఎగ్జామిన్ చెయ్యండి. బిల్లు విషయం అంతా మా ఆయన చూస్తారు” అని రాసింది.

కన్నమ్మ, జుట్టు గోళ్ళతో దువ్వి ముడేసుకుంది. గోచీ విప్పి కుచ్చీళ్ళు సర్దుకుంది. చీటీ అందుకుంటూ — “ఎంకడిని తీసుకుపోతానమ్మా! .... ఆడేడిస్తే .... మీ పని.... అవదు.”

“వాడెందుకే తద్దినం నీకూ? నిక్షేపంలా పడు కున్నాడు. ఏడిస్తే పాలు పడతాలే. కొంచెం తొందరగా వెళ్ళు” — డబ్బులిస్తూ ఆస్పత్రికి వెళ్ళే వివరాలన్నీ చెప్పి కన్నమ్మని తొందరచేసి పంపించింది.

రాధ, పనులన్నీ పూర్తిచేసి స్నానానికి వెళ్ళ బోతూంటే రాగం అందుకున్నాడు వెంకడు. వాడికి పాలుపట్టి ఎత్తుకు తిప్పుతోంటే వచ్చింది కన్నమ్మ. వస్తూనే నవ్వు మొహంతో “డాట్రుగారు ఎంత మంచోరమ్మా?” అంది.

“ఏం? ఏమన్నారూ?”

“ఇండీషను చేశారు. మాత్తర్లిచ్చారు. మీకీ ఉత్తరం ఇమ్మన్నారు” అంటూ కన్నమ్మ కొంగున కట్టుకున్న ఉత్తరం విప్పి ఇచ్చి కొడుకుని అందుకుంది.

రాధ గదిలోకెళ్ళి ఉత్తరం చదివింది — కన్నమ్మ జబ్బు గురించి కొంచెం జాగ్రత్తగా వుండాలని హెచ్చ రిస్తూ రాశాడు డాక్టరు.

“రక్త పరీక్ష చెయ్యాలి. ఎక్స్‌రే తియ్యాలి. అంత వరకూ రిజల్ట్సు చెప్పలేను. టీ.బీ. లక్షణాలు కొన్ని కన్పిస్తున్నాయి. మీరు జాగ్రత్తగా వుంటారని ఈ విషయం రాశాను. ఒక వారం పది రోజులు వరసగా ఇంజక్షను ఇచ్చి చూస్తాను. టాబ్లెట్స్ ఇస్తున్నాను. శ్రద్ధగా వాడించండి. టీ.బీ. కాకపోతే ఈ ట్రీట్‌మెంట్‌తో బాగైపోతుంది. మరేం భయం లేదు.”

రాధ గుండెలు దడదడా కొట్టుకున్నాయి. ఏమీ పాలుపోలేదు. బాత్ రూమ్‌లో పెట్టుకున్న వేడినీళ్ళ మాట జ్ఞాపకం వచ్చి గబగబా వెళ్ళింది.

“అమ్మా, డాక్టరు బాబేం రాశారు?”

“అబ్బే! ఏమీలేదు. మాత్రలు శ్రద్ధగా వేసుకో మన్నారు. రోజూ ఆస్పత్రికి వెళ్ళి ఇంజక్షన్ చేయిం చుకు రావాలి.”

“రోజూ నా?”

“ ఆఁ, వెళ్ళాలి వారం రోజులు”

ఆ సాయంత్రం, అంతా సత్యన్నారాయణకి చెప్పింది రాధ.

“కొంచెం జాగ్రత్తగా వుండు. పైపనులు చెయ్యనీ గానీ వంటింట్లోకి రానివ్వకు. ఎందుకైనా మంచిది” అని వూరుకున్నాడతను.

భర్త ఇంకేమీ అననందుకు చాలా ఆశ్చర్య పోయింది రాధ. ‘ఇంట్లోంచి పంపిం చెయ్య’ మంటా డేమోనని చాలా భయపడింది.

పొమ్మనటం సులువేగాని పాపం ఎక్కడికి పోతుంది?

తర్వాత కూడా రెండు రోజులు కన్నమ్మని ఆస్ప త్రికి పంపించింది రాధ.

మూడోనాడు రాధ పుట్టింటి నుంచి టెలిగ్రాం వచ్చింది — నాయనమ్మకి సీరియస్‌గా వుందనీ, రాధని కలవరిస్తోందనీ.

ఆవిడ ఓ ఏడాది నించీ పక్షవాతంతో తీసు కుంటోంది. ఎప్పటి కప్పుడే చచ్చిపోయేంత హంగామా చేసి, అందర్నీ చూశాక బతికి బయటపడుతోంది. అందుకే, టెలిగ్రాం చూచి సత్యన్నారాయణ నవ్వుతూ “మీ నాయనమ్మ కాదుగానీ మనల్ని చంపుతోంది. ఏం

ఫర్వాలేదు. ఆవిడే బతికేస్తుంది. బతకటం మానేసిందని మళ్ళీ కబురొస్తే వెళ్దుగాన్లే" అన్నాడు.

రాధకి కోపం వచ్చింది. అప్పటికే ఏడు పొచ్చేస్తోంది. నాయనమ్మంటే రాధకి చాలా ఇష్టం. రాధ చిన్నప్పుడంతా నాయనమ్మ దగ్గిరే పెరిగింది — నాయనమ్మ చేయించిన చక్రాల లోలాకులు ఇప్పటికీ దాచుకుంది. భర్తగారి హాస్యానికి ఏడుపు ముఖంపెట్టి "నేనంటే మా నాయనమ్మ కెంత ప్రాణమో తెలుసా? నన్ను చూడకపోతే అది నిజంగా చచ్చి పోతుంది. ఇప్పుడు ట్రయినుంటే వెళ్ళిపోతాను" అంది బట్టలు సర్దుకుంటూ.

"పిల్లల్ని తీసికెళ్ళవా? నన్ను చంపుకు తింటారు."

సాయంత్రం పిల్లలు వచ్చే వరకూ ఆగాల్సి వచ్చింది రాధ. ఆ లోపల పెట్టె సర్ది వుంచింది. ఇంటి వ్యవహారాలన్నీ కన్నమ్మకి చెప్పింది. సత్యనారాయణ హోటల్లో తింటాడు. కన్నమ్మ ఒక్కతి కొంచెం అన్నం కూరా వండుకుంటుంది — అలా తిండి ఏర్పాట్లు చేసేసింది.

"నువ్వు ఆస్పత్రికి వెళ్ళటం మానకు సుమా!" అని హెచ్చరించింది కన్నమ్మని. ఇల్లంతా దానిమీద వదిలేసి బండెక్కింది.

సత్యనారాయణ — పెళ్ళాన్నీ, పిల్లల్నీ రైలెక్కించి — "బెంగ పడుతూ కూర్చోకు. ఏదీ మన చేతుల్లో లేదు. ఏం చేస్తాం?.... పిల్లలు జాగ్రత్త!.... మళ్ళీ ఎప్పుడొస్తావు?" అని మాట్లాడుతూ నిలబడ్డాడు.

"నాయనమ్మకి బాగుంటే వారం పది రోజుల్లో వచ్చేస్తా."

"అక్కడికెళ్తే అంతా మర్చిపోతావు. వచ్చే ఆదివారం వచ్చేశావంటే నేను స్టేషన్‌కి రావటానికి వీలుగా వుంటుంది. లీవు ఇంకా పొడిగించకు" అంటూ నవ్వాడు.

రాధ మూతి ముడుచుకుంది.

"ఇప్పుడు ఇంటికి వెళ్ళినా నిద్ర పట్టదు. సెకండ్ షోకి వెళ్తా" అన్నాడు వాచీ చూసుకుంటూ.

"పాపం కన్నమ్మకూడా ఒక్కతీ చంటి పిల్లాడితో వుంటుంది. కొంచెం తొందరగా ఇంటికెళ్తూ వుండండి!"

రైలు కదిలింది. ఫ్లాట్ ఫారమ్ మీద నుంచున్న భర్తని కనిపించేవరకూ చూస్తోనే వుంది, రాధ. వారం పదిరోజులు అతన్ని వదిలి వుండటం కష్టమే!

★ ★ ★

రాధతోపాటు అక్కలూ అన్నలూ మేనత్త పిల్లలూ — రావలసిన వాళ్ళంతా వచ్చారు. అట్టహాసంగా ముస లావిణ్ణి సాగనంపడానికి. అందర్నీ చూచి నాయనమ్మ తేరుకుని బతికేసింది — నాలుగోసారి.

"హారినీ! ఇదో వేషంలా వుందే నీకూ?" అన్నాడు ఒక మనవడు.

"మళ్ళీ మాకు సెలవు దొరకదు. ఈసారి నువ్వు నిజంగా చచ్చిపోయినా మేము రాము. మర్యాదగా అ పనేదో ఇప్పుడే కానీ!" అన్నారు మనవలంతా బెదిరిస్తూ.

"ఏం చెయనర్రా? నారాయణుడు నన్ను తీసి కెళ్ళటం లేదు" అందావిడ ధీమాగా, బోసి చిరు నవ్వులు చిందిస్తూ.

"చిత్రగుప్తుడు నీ ఫైల్ పారేశాడో ఏవిటో? వెధవ ఆఫీసులు. ఈమధ్య ఇలాగే ఏడుస్తున్నాయి" అన్నాడు ఆఫీసరు మనవడు.

"కాదర్రా! అమ్మమ్మ చిత్రగుప్తుడి నోము నోచిందర్రా, నాలు గైదుసార్లు. ఎంతైనా ఇప్పట్లో ఆర్డర్స్ వెయ్యడు, పదండి పోదాం."

"అబ్బ! నాయనమ్మని అలా అన కండర్రా! ఎంత మంచిది! చిన్నప్పుడు అమ్మ చూడకుండా మనకి మీగడంతా వేసేసేది. బెల్లంముక్కలు పెట్టేది" అంది రాధ.

"అవునవును, నీకు లోలాకులు కూడా చేయించింది కదూ? అందుకే నువ్వు దానికి సపోర్టు పలుకుతావులే."

"నాయనమ్మా! నీ దగ్గిర చాలా డబ్బుందట. మా కందరికీ పంచుతావా, లేదా? పంచనని చెప్పు. చూపిస్తాను నా తడాఖా!" — ఓ మొండి మనవడు.

"రామ! రామ! చిల్లిగవ్వ లేదర్రా! చచ్చేముందు అబద్ధం ఆడనర్రా!"

"నాయనమ్మా! నిజంగా నీకు చచ్చి పోవాలని వుందటే? అది తేల్చు ముందు!"

"ఉందర్రా! నారాయణుడు పిలవడు. నేనేం చెయ్యనూ?" — అదీ పాయింటే!

"పోనీ ఒక పని చేస్తాం. నీ పేర్న మేమంతా నారా

యణుడికి పూజలవీ హోరెత్తేలా చేసేస్తాం. నువ్వు వచ్చే స్తానంటున్నావని అర్జీలు పెడతాం. ఏం? అలా చెయ్యమంటావా?"

"ఎందుకులెండి నాయనా! అప్పుడే ఏం కంగారూ? నారాయణుడేం పనిలో ఉన్నాడో!" అంది నాయనమ్మ సహనంగా.

అందరూ నాయనమ్మని ఆడిస్తూ నవ్వుల్తో గడిపేశారు వారం రోజులు. ఒక్కొక్కళ్ళూ తిరుగు ప్రయాణాలు ప్రారంభించారు.

రాధ నొక్కదాన్నీ ఇంకా రెండు రోజులుండమంది నాయనమ్మ.

అనుకున్న ఆదివారం రాధ బయల్దేరలేదు.

సత్యనారాయణ స్టేషన్ కొచ్చి విసుగ్గా తిరిగి వెళ్ళిపోయాడు.

★ ★ ★

తర్వాత మూడు రోజులకి మిట్ట మధ్యాన్నం దిగింది రాధ పిల్లల్తో. కన్నమ్మ గబగబా వచ్చి తలుపు తీసింది — "అమ్మా! మంచినీళ్ళు కావాలా?" అంది. వద్దంటూ లోపలికి నడిచింది రాధ.

ఇల్లూ వాకిలీ అద్దంలా వున్నాయి. ఇదివరకైతే, నాలుగు రోజు లెక్కడికైనా వెళ్ళి ఇంటికొస్తే ఇల్లంతా మట్టి కొట్టుకుపోయి వుండేది. ఎక్కడి సామాన్లక్కడ పొందిగ్గా వున్నాయి.

"నీ ఒంట్లో ఎలా వుంది కన్నమ్మా?"

"బాగుందమ్మా! దగ్గు కొంచెం తగ్గింది."

"వెంకడెలా ఉన్నాడు?"

"బాగున్నాడమ్మా!"

"అయ్యగారు ఎప్పుడెళ్ళారు బయటికి?"

"పొద్దున్నే ఎళ్ళి పోయారమ్మా! రాత్రికిగానీ రారనుకుంటా. మీరు ఆదివారం రాలేదని అయ్యగారు శానా ఇసుక్కున్నారు."

రాధ నవ్వుతూ "ఏం? ఏమన్నారేమిటీ?" అంది.

"అన్నట్టు.... మామ్మగారి కెలాగుందమ్మా?"

"బాగుంది. సుఖంగానే ఉంది."

పిల్లలకి స్నానాలు చేయించి బట్టలు మార్చింది కన్నమ్మ. వాళ్ళు హుషారుగా ఆడుకోటానికి పోయారు.

రాధ వంటలో మునిగింది.

సత్యనారాయణ వచ్చేసరికి — పనంతా తెముల్చుకుని — స్నానంచేసి పువ్వులా సింగారించుకుని కనిపించాలని రాధ ఆతృత.

కన్నమ్మకి పైపనులు పురమాయిస్తూ తను వంట ముగించింది. స్నానంచేసి తెల్లచీర కట్టుకుంది. జడ అల్లుకుని బొట్టు పెట్టుకుంది — పిల్లలొస్తే గబగబా అన్నాలు పెట్టింది. అప్పటికే ఎనిమిది దాటింది.

"కన్నమ్మా! పిల్లలకి పక్కలెయ్యి. తొందరగా పడుకుంటారు. పగలంతా రైల్లో ఉండి నానా హైరానా పడ్డారు. వెధవ ప్రయాణం. వారం రోజులకిగానీ ప్రాణాలు తేరుకోవు."

పిల్లల్ని మందలించి తొందరగా పడుకో బెట్టింది.

"కన్నమ్మా! మరువం బాగా ఎదిగి పోయినట్టుంది, కొంచెం తెంపి తీసుకురా! మాల కడతాను."

"దీపాలు పెట్టాక కొయ్యకూడదమ్మా!"

"ఫర్వాలేదు లెద్దూ! ఇందాకే చెప్దామని మర్చిపోయాను."

కన్నమ్మ ఒక ప్లేటునిండా మరువం రెమ్మలు తెంపి తెచ్చింది. రాధ తీరిగ్గా మాల కట్టడానికి కూర్చుంది.

"చెప్పు కన్నమ్మా! కబుర్లేమిటీ?"

కన్నమ్మ తలదించుకుని కూర్చుంది. మాట్లాడ లేదు.

"మనింటి కెవరైనా వచ్చారా, నేను లేనప్పుడు?"

"లేదమ్మా! అయ్యగారు ఇంట్లోనే ఉండేవోరు కారు. ఇంకెవరొస్తారు?"

"ఇప్పుడు నీ ఒంట్లో తేలిగ్గా వుందా? ఎక్కడా దగ్గుతున్నట్టు లేదే?"

"................................."

"అదేమిటి కన్నమ్మా! మాట్లాడవేం?.... ఇలా చూడు! .... అరె! అలా వున్నావేమిటి? డాక్టరుగారేమన్నా చెప్పారా?"

కన్నమ్మ తల అడ్డంగా వూపింది మాటలు రాక. కళ్ళెంట నీళ్ళు ఇటూ అటూ పడ్డాయి.

రాధ తెల్లబోయింది — "ఏమిటి కన్నమ్మా! .... చిన్న పిల్లలా .... చెప్పకుండా ఏడుస్తావేం?" బుజ్జగిస్తూనే మందలింపుగా అడిగింది.

అప్పటికీ కన్నమ్మ కాస్సేపు మాట్లాడ లేదు — గబ గబా కళ్ళు తుడుచుకుని అంది — "అయ్యగారికి నా మీద చాలా కోపంగా వుందమ్మా!"

"అయ్యగారికా? నీ మీద కోపం ఏమిటి? ఎందుకూ? ఏదన్నా పనిచెప్తే చెయ్యనన్నావా? .... ఛ! నువ్వలా ఎందుకంటావు?"

"అమ్మా! అంతా నా ఖర్మ...." కన్నమ్మ గొంతు పూడుకొచ్చింది. కన్నమ్మ మొహం ఎప్పట్లా కళగా లేదు.

రాధ గుండెలు దడదడ లాడాయి. మనస్సేదో శంకించటం ప్రారంభించింది — కంపించే కంఠంతో కొంచెం కోపంగా అడిగింది "ఎందుకా ఏడుపు? చెప్పే దేదో చెప్పకపోతే .... నాకెలా తెలుస్తుంది? అస లేమైంది? ఆయన నిన్నేమన్నారు?"

కన్నమ్మ బావురుమంది — "అమ్మా! మీ పాదాల సాక్షి. నామాట నమ్మండి. నేను చెడ్డముండని కాను. మీకు ద్రోహం చేస్తానా అమ్మా? నే నొప్పుకోలేదు."

అదిరిపడింది రాధ. శరీరమంతా కంపన పుట్టింది. వేళ్ళు వశం తప్పిపోయాయి. మరువం మాల ఒళ్ళో పడేసుకుంది. వెర్రిచూపులు చూసింది. నోరు పెగుల్చు కుంటూ అడిగింది "ఏమిటి? ఒప్పుకోకపోవటం ఏమిటి?.... అసలేమైందో చెప్పవేం? .... అంతా చెప్పు, నేను వినాలి."

"మళ్ళా అయ్యగార్నడగకండమ్మా!"

"ఏం? అడిగితే నీకేం?" కోపంగా అంది రాధ.

"మీ పాదాలట్టుకుంటానమ్మా! నన్నీ కూటికీ దూరం చెయ్యకండి. అసలే అయ్య గారికి నామీద పుట్టెడు కోపంగా వుంది .... మీతో చెప్పొద్దని నన్ను బెదిరించారు."

రాధకి పట్టరానికోపం వచ్చేసింది — "అసలే మైందంటే చెప్పలేం? ఏమిటా నిర్లక్ష్యం" అని గట్టిగా కసిరింది.

కన్నమ్మ బిత్తరపోయింది. "ఆదివారం రాత్రమ్మా .... అయ్యగారు మీకోసం బండికెళ్ళొచ్చారు .... కోపంగా వొచ్చారు...."

రాధ మనో ప్రపంచం గిర్రున తిరుగుతోంది!

★ ★ ★

ఆదివారం రాత్రి సత్యన్నారాయణ.... రాధకోసం స్టేషన్ కెళ్ళాడు. సాధారణంగా రాధ ఆ బండికే వస్తుంది. బండి వెళ్ళేదాకా చూశాడు. నిరాశపడి వెనక్కి తిరిగాడు. కాస్సేపు బజార్లో గడిపాడు. హోటల్లో భోజనం చేశాడు. పదిగంటల వేళ ఇంటి ముఖం పట్టాడు.

కన్నమ్మ మెలకువగానే వుంది. తలుపు తీసింది.

"అమ్మగారు రాలేదా బాబూ?"

"రాలేదు" — విసురుగా గదిలో కెళ్ళి పోయాడు.

కన్నమ్మ గదిగుమ్మం దగ్గిరకెళ్ళి అడిగింది. "పాలు తెమ్మంటారా బాబూ? తోడెట్టెయ్య మంటారా?"

"నా కక్కర్లేదు. ఏదో ఒకటి చెయ్యి!"

కన్నమ్మ వంటింట్లోకొచ్చి వున్న కాసిన్ని పాలూ తోడెట్టింది. తలుపులన్నీ వేసి — లైట్లు తీసేసి — వరండాలోకొచ్చి తన పక్క దగ్గిర చతికిల బడింది. వెంకడు నిద్రపోతున్నాడు. వాణ్ణి బాగా పక్కలోకి జరుపుకుంది — నడుం వాల్చిందో లేదో కునుకు పట్టే సింది. గంటా గంటన్నర పైగా నిద్రపోయినట్టే గుర్తు.

తలుక్కున మొహంమీద లైటు పడింది. తట్టి లేపినట్టు మెలుకువొచ్చింది. కంగారుగా పైట సర్దు కుంది. గుమ్మంలో నించున్న మనిషిని చూసి నిద్ర కళ్ళతో పోల్చ లేక — "ఎ.... ఎ.... ఎ...." అంటూ వెర్రి కేక లేసింది.

"నేనే! నేనేలే .... నేనే .... మంచినీళ్ళు కావా లనీ...." నించునే వున్నాడు సత్యనారాయణ. బనీనూ — లుంగీ వున్నాయి ఒంటిమీద.

చటుక్కున లేచింది కన్నమ్మ. "మర్చి పోయాను బాబూ! వంటింట్లోనే వుంది కూజా."

"తీసుకురా!" వెళ్ళిపోయాడు గదిలోకి.

కన్నమ్మ పిల్లాడిమీద గుడ్డకప్పి వంటింట్లోకెళ్ళి గ్లాసూ, కూజా తీసుకుని, రాధా సత్యన్నారాయణా పడుకునే గదిలో కెళ్ళింది. గదిలో లైటు వేసివుంది. ఎప్పుడూ మూయని కిటికీ తలుపులు మూసి వున్నాయి. మంచానికి వున్న దోమతెర ఎదరవేపు ఎత్తిపట్టి వుంది. అవన్నీ మొదట నిద్రకళ్ళతో గమ నించలేదు కన్నమ్మ.

సత్యన్నారాయణ మంచం మీద కూర్చుని వుండటం చూసింది. దగ్గిరికి వెళ్ళి కూజా, గ్లాసూ బల్ల మీద పెట్టింది — "మంచినీళ్ళిమ్మంటారా బాబూ?"

"నే తాగుతాలే" గ్లాసులోకి నీళ్ళు వొంచుకొని ఒక్క గుటికెడు తాగి గ్లాసు, కూజా పక్కన పెట్టేశాడు — "అదిగో! ఆ డ్రాయరు తీసి అమృతాంజనం సీసా వుంటుంది, చూడు."

ఆ డ్రాయరు ఒక్క అడుగు వేస్తే అతనికే అందుతుంది.

"ఈ సొరుగులోనా బాబూ?" కన్నమ్మ సొరుగు లోంచి అమృతాంజనం సీసా తీసి మంచం దగ్గిరికి వచ్చి సత్యన్నారాయణకి అందించబోయింది.

అదేం పట్టించుకోనట్టు సత్యన్నారాయణ కూర్చున్నవాడల్లా పడుకున్నాడు — "కొంచెం ఇలారా! ఇక్కడ రాయి .... తల బద్దలవుతోంది."

కన్నమ్మకి అయోమయం అయిపోయింది. "మీరే .... రాసుకోండి. బాబూ! అవతల పిల్లోడొక్కడూ వున్నాడు."

"వాణ్ణికూడా తీసుకొచ్చి .... ఆ మంచం మీద పడుకోబెట్టు! అవతల ఎందుకూ? చలిగాలి. నేను తీసుకు రానా?"

కన్నమ్మకి నిద్రమత్తు పూర్తిగా విడిపోయింది. కాళ్ళూ చేతులూ వణకటం మొదలెట్టాయి .... అమృతాంజనం సీసా బల్లచివర పెట్టేసింది. "వద్దు బాబూ! మీరే రాసుకోండి. నేను పిల్లోడి దగ్గర పడుకుంటా" అంది. చటుక్కున వెనక్కి తిరిగింది.

"ఏయ్! ఏంటా నిర్లక్ష్యం నీకు? — నించో ముందు. నా ఇంట్లో వున్న దానివి నేను చెప్పినట్టు వినవా?"

కన్నమ్మకి భోరున దుఃఖం వచ్చేసింది "అదేం మాట బాబూ? ఎందుకు ఇనను? — రెక్కల చాకిరీ చెయ్యమంటే చెయ్యనా? — మీరెంతో మంచోరని అమ్మగారు చెప్తే .... ధయిర్యంగా వున్నాను బాబూ!"

"ఏం? ఇప్పుడుమాత్రం ఏమైంది? — మా ఇంట్లో వుంటే నీకేం లోటు? .... అమ్మగారొక్కతే నా ఇష్టం లేకుండా — నిన్ను ఆదరించి వుంచుకుందను కుంటున్నావా? మళ్ళీ — ఇల్లిల్లూ తిరగాలని వుందా? ఎందుకలా భయపడి పోతావ్? — ఎవరికీ తెలీదు. అమ్మగారికి నేను చెప్పను. నువ్వూ చెప్పకు."

కన్నమ్మ గజగజా వణికిపోయింది — "తెలుస్తుం దని కాదు బాబూ! తెలవకపోయినా వొద్దు. మీరంటే అమ్మగారికెంతో ప్రేణం. మిమ్మల్నొక దేవుళ్ళాగా, రాములోరి లాగా, చూసుకుంటుందా తల్లి. ఆరి మొహం చూడండి బాబూ! మీరిద్దరూ సీతారాము ల్లాంటోరు బాబూ! నాలాంటి ముండతో మీకేంటి? — మీ అరిపాదం ముట్టటానిక్కూడా పనికిరాను బాబూ!"

వంకలెంచటం కాదుగానీ — కన్నమ్మ చూడ చక్కనిది కాదు. పొట్టిగా పిట్టంత మనిషి. నల్లటి నలుపు. మొహంనిండా స్ఫోటకం గుంటలు. అక్కడక్కడా నెరిసి — నిమ్మకాయంత ముడి. చేతులకి నాలుగేసి పాత రబ్బరు గాజులు, కట్టినచీర పాతబడి రంగుమాసి తెల్లంచు కూడా నల్లచీరతో కలిసి పోయింది. ఒళ్ళంతా చెమట వాసన. పిల్లాడి కక్కుల కంపు, రాధ అజ్మాయిషీ లేక కన్నమ్మ ఎడ్డిగానే తయారైంది.

కానీ, ఆ పురుషుడికి అదంతా పట్ట లేదు. కన్నమ్మని కావిలించుకోవాలని ఆరాటం ఎక్కువైంది. లేచి నుంచున్నాడు. తటపటాయిస్తూనే ముందు కడుగేసి కన్నమ్మ చెయ్యి పట్టుకున్నాడు — "అదంతా నాకు తెలుసులే. మీ అమ్మగారికేం లోటొచ్చిం దిప్పుడు? ఇలా రా! ముందిలా మంచం మీద కూర్చో" అంటూ బలవంతంగా మంచం దగ్గిరికి లాగాడు.

"బాబూ — బాబూ! వదలండి — మీ అప్ప చెల్లె ల్లాంటి దాన్ని. నన్నన్నేయం చెయ్యకండి! అమ్మగారికి మొకం చూపించ లేను. పురుగులు పడిపోతాను బాబూ! మీ పాదాలు పట్టుకుంటాను. మీ కాళ్ళకి దణ్ణం పెడతాను" అంటూ కన్నమ్మ వలవలా ఏడుస్తూ అతని కాళ్ళట్టుకోబోయింది.

"ఛీ! ఏంటా ఏడుపు? నా మాటిను. అమ్మగారికి తెలీదు — నా మాట నమ్ము! ఇలా చూడు! నీ కొడుకుని పెంచి పెద్దోణ్ణి చేసుకోవాలని లేదా? వాడికి చదువు సంధ్యలక్కర్లేదా?.... మా ఇంట్లో వుంటే నీకేం లోటు? నీ కెప్పుడు కావలసినా నన్ను డబ్బులడుగు. ఇప్పుడిమ్మంటావా చెప్పు! అడిగి తీసుకోవాలిగానీ — ఇంత మొండిపట్టు పడతావేం? ...."

సత్యన్నారాయణ బట్టలస్టాండు దగ్గిరికి వెళ్ళి పేంటు జేబులోంచి పర్సుతీసి పది రూపాయల నోటు తెచ్చి కన్నమ్మ చేతిలో పెడుతూ — "ఉంచుకో, ఎందుకైనా ఉంటుంది. ఉంచుకో, తర్వాత మళ్ళీ ఇస్తాలే. తీసుకో కన్నమ్మా!"

బిక్క చచ్చి నించున్న కన్నమ్మ నోటుని పురుగుని విదిలించినట్టు విదిలించేసింది — "మీకు డబ్బుంటే ఉండనివ్వండి బాబూ! నన్ను బలవంతం చెయ్యా టానికి మీకేవీ అక్కులేదు. నాకు మీరిచ్చే రూపా యలూ వొద్దు, నా కొడుక్కు చదువు సందెలూ వొద్దు.

బతకలేకపోతే అడిని నూతిలో ఎత్తేసి నేనూ నూతిలో ఉరికేత్తా. నేను చెడ్డముండని కాను బాబూ! ఇప్పుడే నా దార్ని నేను పోతా...." సత్యన్నారాయణ చెయ్యి విదిలించేసి గుమ్మందాటి వెళ్ళిపోయింది. కొడుకుని ఎత్తి ఒళ్ళో పెట్టుకుని — "నాయనా ఎంకన్నా! మన కష్టాలు తీర వురా తండ్రీ!" అంటూ గుండెలు కదిలేలా ఏడుస్తూ కూర్చుంది.

కొయ్యబారిపోయిన సత్యనారాయణ కదిలి గుమ్మంలో కొచ్చాడు — "ఇదిగో మాట — అయిం దేదో అయిందిలే. నాదే తప్పు. నువ్విలాంటి దానివని నాకు తెలీదు — మర్చిపో. అమ్మగారికి చెప్పకు సుమా! చాలా గొడవ వస్తుంది మా ఇద్దరికీ. నా మాట జ్ఞాపకం ఉంచుకో. అమ్మగారికి ఒక్క మాటకూడా చెప్పకు!" రెట్టించి రెట్టించి చెప్పి వెళ్ళిపోయాడు.

కన్నమ్మకి కన్ను మూత పడలేదు మిగిలిన రాత్రంతా.

వరండాలో లైటు వుంచుకుని తెల్ల వార్లూ రాయిలా కూర్చుంది.

★ ★ ★

"అమ్మా! అయ్యగారికీ మీకూ జగడం పెట్టాలని కాదు నేను చెప్పింది. ఇలాంటి కబురు దాసినందుకే గంగమ్మ నాకు బాగా బుద్ధి సెప్పింది. ఈ కబురు నా కడుపులోనే దాస్తాననుకోండి. రేపట్నుంచీ అయ్యగారు మళ్ళీ ఏదన్నా అంటే, అది మీ కంటపడితే, అప్పుడే మనుకుని ఏం లాభం? ఎంత చెప్పినా తవరు నన్ను నమ్ముతారా? నా పూచీ తీరిపోయింది. మీ పెనిమిటిని మీరే అదుపులో పెట్టుకోండి. ఒక కన్నేసి చూసుకోండి — నేనంటే అయ్యగారికి శానా కోపంగా ఉంది. నన్ను నీళ్ళ ముంచినా పాల ముంచినా మీరే. మీరే దిక్కు నాకు" — కన్నమ్మ కంఠం తేలికపడింది. మొహం తేట పడింది. గుడ్లప్పజెప్పి చూస్తూ కూర్చుంది.

రాధకి బాహ్యస్మృతి పోయింది, ఆదిలోనే. కలలోలాగ వింది. భయంకరమైన పీడకల చూసినట్టు అయింది. అప్రయత్నంగా లేచి నించుంది. ఒళ్ళోంచి మరువం రెమ్మలు తుళ్ళి దూరంగా పడ్డాయి. వాటిని తొక్కుకుంటూ నడిచింది. తూలుతూ అడుగులేసింది. కళ్ళు చీకట్లు కమ్ముకొచ్చాయి. కాలికి తగిలిన మంచం మీద పిల్లలమధ్య పడిపోయింది.

ఎంతసేపు అలా పడి ఉందో రాధకి తెలియదు. పదకొండు దాటింది. సత్యన్నారాయణ తలుపుకొడితే కన్నమ్మ వెళ్ళి తీసింది. తల దించుకుని వెళ్ళిపోతోన్న సత్యన్నారాయణ వెనకాల అంది కన్నమ్మ "అమ్మగా రొచ్చేశారు బాబూ!"

అదిరిపడ్డట్టు ఆగి వెనక్కి తిరిగిచూసి ముందు కడుగేశాడు — గుమ్మంలో నిలబడ్డాడు. గది చీకటిగా ఉంది. రాధ తన మంచం మీద లేదు. పిల్లలమధ్య పడుకుని నిద్రపోతోంది.

సత్యన్నారాయణ తటపటాయించాడు. టవలు తీసుకుని బాత్‌రూమ్‌లో కెళ్ళి స్నానంచేసి వచ్చాడు. లుంగీ కట్టుకుని టవలు ఆరవేశాడు.

రాధకి మెలకువొచ్చిన జాడలేదు. ఈ కన్నమ్మ ముండ చెప్పెయ్య లేదుకదా? ఏడిసింది. దానికంత ధైర్య మెక్కడిది? — తను వద్దన్న తర్వాతకూడా చెప్పిం దంటే దాని గతేమౌతుందో తెలీదూ?

నెమ్మదిగా వెళ్ళి రాధ పక్కన కూర్చున్నాడు. జుట్టు మీద చెయ్యివేసి నిమిరాడు.

తుళ్ళిపడింది రాధ. చీకట్లో దెయ్యాన్ని చూసినంత జడుసుకుంది. చటుక్కున లేచి కూర్చుంది. రాధ మొహం ఎలా వున్నదీ సత్యన్నారాయణకి అంతుచిక్క లేదు.

"ఏ బండికొచ్చారు?"

"మధ్యాన్నం...."

"మీ నాయనమ్మ కెలా ఉంది?"

"బాగా.... లేదు."

"పోనీ.... ఇంకో నాలుగు రోజులుండక పోయావా?"

"................................"

"ఏం రాధా? అలాగున్నావ్? ఒంట్లో బాగాలేదా?"

"తలనొప్పిగా ఉంది."

"మరి చెప్పవేం? అమృతాంజనం రాయనా?"

"ఊహూ! నాకా వాసన బాగుండదు .... మీకు .... అన్నం .... పెట్టనా?"

"అక్కర్లేదు .... నువ్వొచ్చావని తెలీదుగా? .... హోటల్లో తినేశాను."

రాధ లేచి వరండాలో కొచ్చింది.

కన్నమ్మ కడుపులో కాళ్ళు పెట్టుకుని పడుకుని

వుంది.

"కన్నమ్మా!"

కునుకు తీస్తోన్న కన్నమ్మ ఉలిక్కిపడి లేచింది — "ఏంటమ్మా?"

"అన్నం తినకుండా పడుకున్నావేం? నాకు నిద్ర పట్టేసింది. నువ్వు పెట్టుకు తినెయ్య లేకపోయావా? లేచిరా! గిన్ని తెచ్చుకో. అర్ధరాత్రయింది."

"ఇప్పుడేం తిండిలేమ్మా?" అంటూనే కన్నమ్మ గిన్నితెచ్చి గుమ్మంలో పెడుతూ — "మీ రొడ్డించుకోరా అమ్మా?" అంది.

"తలనొప్పిగా వుంది. ఏదీకానివేళ అన్నంతింటే నా కసలే పడదు. కొంచెం మజ్జిగ తాగుతా."

"అయ్యగారో?"

"తినేసి వచ్చారు."

కన్నమ్మ — గిన్నిలో అన్నం కూరలూ పెట్టేసి, గ్లాసులో మజ్జిగపోసి, చెయ్యి కడుక్కుని గదిలో కెళ్ళి పోయింది — రాధ.

సత్యన్నారాయణ గదిలో పరుపు మీద పడుకుని వున్నాడు. రాధ మళ్ళీ హాలులో పిల్లల మధ్యే పడుకుంది.

"రాధా! అక్కడ పడుకున్నావేం? ఇలా రా!"

"చంటివాడికి బాగాలేదు. ఉలికులిక్కి పడు తున్నాడు. జడుసుకుంటాడో ఏమో!" రాధ లేచి వెళ్ళలేదు.

"ఏం? వాడికేం బాగా లేదు?"

"కొంచెం ఒళ్ళు వెచ్చగా వుంది."

ఊరుకున్నాడు సత్యనారాయణ. రాధ తన దగ్గిరికి రాకపోవటానికి కారణం చంటివాడు మాత్రం కాదు కన్నమ్మ చెప్పెయ్య లేదుకదా? చెప్పేస్తే ఇంత కామ్‌గా ఉంటుందా? నిలదీసి అడగదూ? వాళ్ళ నాయనమ్మ బెంగలోంచి తేరుకోలేదేమో! ఆవిడ కాస్తా హరీమంటే ఈవిణ్ణెలా ఓదార్చాలో మరి!

సత్యనారాయణ ఉత్సాహం తగ్గిపోయింది. బల వంతంగా నిద్రపట్టించుకోవాలని ప్రయత్నించాడు.

రాధ తెల్లవార్లూ కన్నుముయ్య లేదు. దిగ్భ్రమతో మనసు బండబారిపోయింది. కళ్ళు చెమర్చనైనా చెమర్చలేదు.

మర్నాడంతా రాధ అలాగే వుంది. కన్నమ్మని ఆస్పత్రికి పంపించింది. సత్యన్నారాయణతో మామూ లుగానే మాట్లాడింది. లోపించిందల్లా మొహంమీద ఎప్పుడూ తారట్లాడే చిరునవ్వు.

రాత్రి భోజనాలయ్యాయి.

రాధ, పుస్తకం పట్టుకుని కూర్చుంది పిల్లల దగ్గిర. సత్యన్నారాయణ వచ్చి రాధపక్కన కూర్చున్నాడు. ఏదో పలకరించాడు.

"కన్నమ్మ గురించి డాక్టరుగారేం చెప్పారు?" అన్నాడు.

"ఇంజక్షన్లవీ ఇస్తున్నారు. ఇప్పుడు దగ్గు బాగా తగ్గింది."

"తగ్గినట్టే తగ్గినా నమ్మకూడదు. ఏమో! టీ.బీ. అంటే మాటలా? వెరీ డేంజరస్ డిసీజ్ అది ..... పిల్లలున్న ఇల్లు."

"మీరనేదేమిటి?" తలఎత్తి చూసింది రాధ.

"మనం అంత రిస్కెందుకు తీసుకోవాలి? పని మనిషేగా నీకు కావలసింది? పది రూపాయలు పడేస్తే ఎవరైనా దొరుకుతారు. ముందు మన ఆరోగ్యాలు చూసుకోవాలి."

"ఇప్పుడు మన ఆరోగ్యానికేం వచ్చింది? టీ.బీ. కాకపోతే తగ్గిపోతుందని డాక్టరుగారే చెప్పారుకదా?"

"చెప్తే మాత్రం? దానికి టీ.బీ. కాదని ఖచ్చితంగా తెల్సుకోవాలంటే ఇప్పుడు ఏభయ్యో, అరవయ్యో తగలేసి టెస్టులు చేయించాలి. అదంతా మనకెందు కొచ్చిన తద్దినం?"

"................................."

"అయినా ఎల్లకాలం ఒక మనిషిని మేపటం ఎంతకష్టం! దానికి రెండుపూటలా భోజనాలూ, టిఫీన్లూ కాఫీలూ, ఆ కుర్ర వెధవకి రోజుకి అర్ధశేరు పాలూ — అంతా లెక్కచూడు ఎంతవుతుందో! ఎన్నాళ్ళు ఇలాగ?"

రాధ, అసహ్యాన్ని అదిమిపట్టాలని విశ్వ ప్రయత్నం చేసింది. తొణక్కుండా బెణక్కుండా కూర్చుంది — "మొట్టమొదట మిమ్మల్ని అడిగే కన్నమ్మని పనిలో పెట్టాను. అప్పుడు మీరు అన్ని ఖర్చులకీ ఒప్పు కున్నారు. కష్టపడి చేస్తోందేమో తింటోందన్నారు. చంటిబిడ్డకు పాలు ఇవ్వటం కన్నా పుణ్యం లేదన్నారు మీరే. ఇప్పుడీ లెక్కలన్నీ ఏమిటి? ఎందుకు?"

"ఎందుకేమిటి? ఎల్లకాలం దాన్ని పోషించి

తీరాలని మనకేం రూలా? కష్టపడి బతికే దానికి ఈ ఇల్లేమిటి, ఆ ఇల్లేమిటి?.... ఎక్కడైనా పొట్ట నింపు కుంటుంది, మన ఇంట్లోనే ఎందుకుంచుకోవాలి?"

"మీరెందుకిలా మారిపోయారు? ఎందుకుంచుకో కూడదో చెప్తే, ఈ క్షణంలోనే వెళ్ళిపొమ్మని చెప్తాను. కన్నమ్మ గురించి మీ అభిప్రాయం ఎందుకిలా మారిపోయింది?"

"నా పిల్లల ఆరోగ్యం నాకు ముఖ్యం. టీ.బీ. ఉన్న దాన్ని నెత్తి నెక్కించుకునే విశాల హృదయం లేదు నాకు" — సత్యన్నారాయణ లేచి నుంచున్నాడు.

"విశాలత్వందాకా ఎందుకు? అసలు నీకు 'హృదయం' ఎక్కడిది?" గుండెల్లో కొట్లాడిందా మాట. నిశ్శబ్దంగా ఉండి పోయింది రాధ.

సత్యనారాయణ మాట్లాడిన ప్రతి మాటకీ ఎదురు ప్రశ్నవేసి నోరు మూయించగలదు రాధ. టీ.బీ. మనిషి అట! ఆ టీ.బీ. మనిషి దగ్గరికే వెళ్ళడానికి ఎలా సిద్ధ మయ్యాడు?

ఎల్లకాలం పోషిస్తామా — అట! మరి, నీ కొడు కుని చదివిస్తానని ఎలా అన్నాడు?

ఎన్ని అయినా అడగొచ్చు. కానీ, అడిగితే, అడిగిన తర్వాత .... ఏమిటి?

ఇద్దరూ ఎడమొహం పెడమొహంగా కూర్చు న్నారు కాస్సేపు. సత్యనారాయణ లేచి తన మంచం మీదికి వెళ్ళాడు. రాధ లైటార్పి పిల్లల దగ్గిరే పడు కుంది.

తెల్లారింది.

ఎంకడు గుక్కపట్టి ఏడుస్తోంటే రాధకి మెలుకువ వొచ్చింది. లేచి బయటికి వచ్చి "ఎందుకలా ఏడుస్తు న్నాడు? రాత్రికూడా అప్పుడప్పుడూ ఏడవటం విన పడిందే" అని పరామర్శించింది, కన్నమ్మని.

"నిన్న సందేల నుంచీ ఆడికి ఒకటే ఇరోసినా లమ్మా! పెద్దబ్బాయి గారు బిస్కట్టు ముక్కెట్టారు. పోనీ తింటున్నాడు కదా అనుకున్నాను. అజీర్తి చేసిందేమో నమ్మా. తెల్లార్లూ ఏకేడుపే. కంటిమీద కునుకులేదు. కడుపులో నొప్పో ఏంటో!" బిక్కమొహం వేసుకుని చెప్పింది కన్నమ్మ.

"ఆ గిన్నెలేవో తర్వాత కడగొచ్చులే. ముందు కాసేపు వాణ్ణి ఎత్తుకో. నెమ్మదిగా నిద్రపుచ్చు. ఆనక డాక్టరు దగ్గిరికి తీసుకెళ్ళు! ఫర్వాలేదు. అవే తగ్గి పోతాయి. చంటిపిల్లలన్నాక ఏమీ రాకుండా ఉంటుందా?" అంటూ రాధ మొహం కడుక్కోటానికి వెళ్ళింది.

కన్నమ్మ లేచివచ్చి కొడుకుని ఒళ్ళో పెట్టుకుని కూర్చుంది. కావలసిన గిన్నెలేవో రాధే కడుక్కుని టిఫిన్లూ కాఫీలూ తయారు చేసింది.

సత్యన్నారాయణ లేచి బాత్‌రూంలో కెళ్ళి వెనక్కి వచ్చాడు చిరాకు పడిపోతూ.

"రాధా! ఏవిటా గుడ్డలు గదిలో? స్నానం చేసే దెలాగ? కాస్త నీట్‌గా వుంచాలన్న ధ్యాస వుండదేం నీకు?"

"ఏం గుడ్డలూ?.... ఎక్కడా?" తెల్ల బోయింది రాధ.

"పిల్లోడి గుడ్డలమ్మా! .... ఆనక వుతుకుదామని ఒక మూల పడేశా" అని పిల్లాణ్ణి కింద పడుకోబెట్టి బాత్ రూమ్‌లోకి పరిగెత్తింది కన్నమ్మ. గది అంతా శుభ్రంగా కడిగి బయటకొచ్చింది.

సత్యన్నారాయణ స్నానం చేసివచ్చాడు. రాధ ఉప్మాప్లేటు గదిలోకి తీసికెళ్ళింది.

"రాత్రంతా.... ఏడుస్తోనే వున్నాడు కుర్ర వెధవ. అసలు నిద్రపడితేనా?" అన్నాడు స్వగతంలాగ.

ఒద్దనుకుంటూనే జవాబు చెప్పింది రాధ — "వాడికి కొంచెం బాగా లేదు."

"చంటి పిల్లలన్న తర్వాత ఏదో ఒకటి వస్తూనే ఉంటుంది. ఎన్నాళ్ళీ గోల ఇంట్లో?"

"....................................."

"మళ్ళీ చెప్తున్నాను రాధా! కన్నమ్మ వుండటం నా కిష్టంలేదు. ఎక్కడైనా ఇల్లు చూసుకోమని చెప్పు! రేపట్నుంచి మళ్ళీ అప్పలమ్మనే పనిలోకి రమ్మని చెప్తాను సాయంత్రం వెళ్ళి."

రాధ మౌనంగా ఇవతలకి వచ్చేసింది.

రాధ మొహంకేసి — భయంగా చూసింది కన్నమ్మ. రాధ చటుక్కున మొహం తిప్పి వంటింట్లో కెళ్ళిపోయింది.

పది గంటలు దాటింతర్వాత కన్నమ్మని ఆస్పత్రికి పంపించింది.

కన్నమ్మ తన దగ్గుకీ, పిల్లాడికీ కూడా మందులు తెచ్చుకుంది.

"అమ్మా! పొద్దున్న అయ్యగారేంటో అంటున్నారే!"

— భయం భయంగా అడిగింది కన్నమ్మ. ఆ ముక్క అడగాలని దాని మనసు కొట్టుకులాడిపోతోంది.

జవాబు చెప్పకుండా రాధ ఎదురు ప్రశ్న వేసింది — "ఎవరింట్లో వుంటే మాత్రం నీకె న్నాళ్ళు గడుస్తుంది కన్నమ్మా? పోనీ మీ అన్న దగ్గిరి కెళ్ళిపోతావా?"

దిగాలుగా చూసింది కన్నమ్మ "అడు రానివ్వ డమ్మా!"

"మీ ఆయనెక్కడున్నాడో వాకబు చేస్తే తెలుస్తుం దంటావా?"

"అడికోసం.... ఎక్కడ తిరగనమ్మా?"

"ఇంకెవ్వరూ లేరా?" — ఆ మాట అంటోంటే రాధ కంఠం పూడిపోయింది.

కన్నమ్మ కళ్ళు పూడుకొస్తున్నాయి — "మీకు తెలవందేంటుందమ్మా? ఎవ్వరూ లేరు. ఉన్నోళ్ళు నన్ను రానివ్వరు."

రాధకి, తనే ఏడ్చేస్తానేమోనని భయం వేసింది. నిశ్శబ్దంగా ఊరుకుంది.

సాయంత్రం సత్యన్నారాయణ ఇంటి కొచ్చాడు. కాఫీ తాగాడు. చీకటి పడేవరకూ చిన్న కొడుకు నెత్తుకుని తిరిగాడు.

రాధ పిల్లలకి అన్నాలు పెట్టింది.

"మీకు అన్నం వడ్డించనా?" అంది మొగుణ్ణి ఉద్దేశించి.

"తింటాలే. కన్నమ్మకు చెప్పావా?"

"................................"

"ఏం? మాట్లాడవేం? మాటడుగుతోంటే అంత నిర్లక్ష్యం...."

"కన్నమ్మ! కన్నమ్మ! కన్నమ్మంటే ఎందుకు మీకు ద్వేషం?"

రెచ్చిపోయాడు సత్యన్నారాయణ — "కన్న మ్మంటే నీకెందుకు ప్రేమ? ఏమిటా లాలూచీ దానితో? — ఆఫ్టరాల్ పని మనిషి విషయంలో ఇంత పంతం ఎందుకు? నాకిష్టంలేదని చెప్పానే — పొమ్మని చెప్ప రాదూ?"

రాధ మాట్లాడలేదు. కొయ్యబారిపోయి నించుంది.

"అమ్మా!" వరండాలో నించున్న కన్నమ్మ తెగించి పిల్చింది. "అమ్మా, ఒక్కసారిలా రండి!" కన్నమ్మ మాటల్లో కంపన స్పష్టంగా తెలుస్తోంది.

రాధ గాలిలో అడుగులేసినట్టు నడుస్తూ బయటి కెళ్ళింది.

కన్నమ్మ, చంకలో పిల్లాణ్ణెత్తుకుంది. కుడిచేతిలో మూట ఉంది. "అమ్మా దయుంచండి! ఎళ్తాను."

"ఎక్కడికి?" నోటి చివర కొచ్చిన మాట బల వంతం మీద ఆపుకుంది రాధ. "కన్నమ్మా! ఇప్పు డెక్కడికి? చీకటి పడి పోయింది ...... పోనీ రేపు ..... వెళ్దువుగానిలే."

"ఒద్దమ్మా! ఎప్పుడైతేనేంటి? రేపు రేత్రికి మల్లా చీకటి పడదా? ఎళ్తానమ్మా — పిల్లల్ని జాగర్తగా చూసుకోండమ్మా!"

"కన్నమ్మా! ఉండు వస్తాను." — రాధ గబగబా లోపలి కెళ్ళింది. తన పెట్టెతీసి సంచిలో ఉన్న యాభై రూపాయలు తీసు కొచ్చింది. అప్పటికే కన్నమ్మ దొడ్డిగుమ్మం దాకా వెళ్ళినించుంది.

"కన్నమ్మా! ఇదిగో. కొంచెం డబ్బు, నీ దగ్గ రుంచుకో! రేపట్నుంచి బోలెడవసరం వుంటుంది.

నోట్లు చూసి భయపడింది కన్నమ్మ — "నా కెందుకమ్మా! అయ్యగారు మిమ్మల్నేవన్నా అంటారేమో నమ్మా!"

"ఇది నా డబ్బే! మొన్న మా నాయనమ్మ ఇచ్చింది. తొందరగా సంచిలో పెట్టు! జాగ్రత్త. వెంకడు జాగ్రత్త వాడికి మందు వెయ్యటం మర్చిపోకు" — రాధ గొంతు పూడుకొచ్చింది.

కన్నమ్మ నోరు పెగలటం లేదు. "అమ్మా! — ఈ ముండని మర్చిపోకండమ్మా!"

"పిచ్చిముండా! ఈ లోకంలో ఎలా బతుకుతావే!" మాటలు పైకి రాలేదు. "ఎన్ని కష్టాలొచ్చినా సరే! ప్రాణాల మీద విరక్తి పెట్టుకోకు కన్నమ్మా! పిల్లాడు న్నాడు ... వాడు దిక్కులేని వాడైపోతాడు కన్నమ్మా! ధైర్యంగా వుండు. కష్టపడి బతగ్గలవు. తొందరపడకు సుమా!"

"అమ్మా! ఎంత దయమ్మా మీకు!"

కన్నమ్మ దొడ్డి గుమ్మం దాటింది. చీకట్ని జడిపి స్తోన్నట్టు కళ్ళు చిట్లించి చూసింది. పిల్లాణ్ణి భుజంమీద వేసుకుని మూట ఈడ్చుకుంటూ నడవటం మొద లెట్టింది. బాగా దూరం అయిపోయింది.

రాధ గుమ్మాన్ని కావలించుకుని వెక్కి వెక్కి

ఏడ్చింది. దుఃఖం ఉధృతం తగ్గిన తర్వాత కళ్ళు తుడుచుకుంది. దొడ్డి తలుపులు గడియ పెట్టింది. వాకిట్లో మొహం కడుక్కుంది.

సత్యన్నారాయణ వీధి వరండాలో పేము కుర్చీలో కూర్చుని పేపరు చదువుకుంటున్నాడు.

రాధ వెళ్ళి పిల్లల దగ్గిర పడుకుంది.

వెళ్ళిపోయింది కన్నమ్మ! హోరు గాలిలో దీపం పెట్టినట్టు దిక్కూ మొక్కూలేని లోకంలోకి వెళ్ళి పోయింది!

ఆలోచిస్తే, కన్నమ్మ బతుక్కన్నా తన బతుక్కున్న రక్షణేమిటి? తిండీ గుడ్డా ఇచ్చే మొగుడొక డుండటమేనా? ఏ క్షణంలో ఏం చేస్తాడో తెలీని మొగుడి అండేనా?

అస్తమానూ గుర్తు వస్తూనే వుంది లీల!

"లీలా! — నువ్వెంత గొప్ప దానివే! మనుషుల్ని క్షుణ్ణంగా చదవగలవు. నా నమ్మకాలు వమ్మయితే, నా గుండె పగిలి చచ్చిపోతానన్నావు. అందులో మాత్రం పొరపడ్డావు. నేనేమీ అయిపోలేదు. నిక్షేపంలా తిని తిరుగుతున్నాను. ఒకటి మాత్రం చెప్పాలి. ఈ ఘోరం నా ప్రాణాలు తియ్యకపోయినా, నా మనోలోకాన్ని కలిచి వేసింది. గతాన్నీ అస్తవ్యస్తం చేసేసింది. నాకు కనువిప్పు కల్గించి మనిషిగా మార్చింది. లీలా! ఈ దారుణం గురించి నీకు రాయకుండా వుంటే నాకు నేను ద్రోహం చేసుకున్న దాన్ని అవుతాను" — మనసులో లీలకి రాస్తోన్న ఉత్తరం పుటలకి పుటలే పెరిగిపోతోంది.

రాధ ఆవేశంగా లేచింది. లైటు వేసి, టేబుల్ ముందు కూర్చుంది. కలం కాయితాలు తీసుకుంది.

లీలా!

నా సంసారంలో నిజమైన విలువ లేమిటో నేనిప్పటికి తెలుసుకున్నాను! నా గర్వం పటాపంచలై పోయింది. నాకు — సిగ్గు ముంచుకొస్తోంది — లీలా! — నిజం చెప్పనా.............."

"రాధా!" — వెనకనించి సత్యన్నారాయణ!

తుళ్ళిపడి ఆగింది రాధ కలం. నిస్తేజంగా చూసింది రాధ.

సత్యన్నారాయణ మొహం చిరు నవ్వుతో ప్రకాశిస్తోంది.

తల తిప్పుకుంది రాధ.

"ఏం రాస్తున్నావు?"

"ఏదో ఉత్తరం" రాధ ఉత్తరం ఆపుజేసి లేచి పోయింది. గబ గబా గదిలోంచి బయటికి వెళ్ళి పోయింది.

"రాధా" వెనకాలే వెళ్ళాడు సత్యన్నారాయణ.

మధ్య గదిలో, చీకట్లో, కిటికీ దగ్గిర కూర్చుని వుంది రాధ.

సత్యన్నారాయణ లైటు వేశాడు. రాధ దగ్గిరికి వెళ్ళాడు. భుజాలమీద చేతులేశాడు — "రాధా! కోపంగా వుందా కన్నమ్మని పంపించెయ్యమన్నానని?"

"................................."

"నీకిది ధర్మంగా వుందా? ఎందుకు కోపం చెప్పు?"

రాధ తల అడ్డంగా వూపింది. భుజాల మీద చేతులు తప్పించింది.

"నా మనసేం బాగాలేదు. మీరు వెళ్ళండి!" ఆజ్ఞాపిస్తోన్నట్టే అంది.

సత్యన్నారాయణ మొహంలో కోపం తొంగి చూసింది. "నీ మనస్సెందుకు బాగా లేదో నాకు తెలుసు. ఒక ముష్టిదాని గురించి ఎందుకింతా లోచన?"

తలఎత్తి తీక్షణంగా చూసింది రాధ. కన్నమ్మ ఆశ్రయం పోగొట్టినదాన్ని అవుతా నేమో అని ఇంత ఓపిక పట్టింది, అతన్ని ఒక్క మాట కూడా అడక్కుండా. ఇక కన్నమ్మని బైటికి తరిమిన తర్వాత ఇంకా ఈ మర్యాదలెందుకు? రాధ కళ్ళల్లో అంతు పట్టని ధైర్యం తొణికిసలాడింది — "ముష్టిదా? అది ముష్టి దెలా అయిందో తెలుసా? నీతికి నిలబడి ముష్టిదైంది. విశ్వాస ఘాతుకం చెయ్యలేక ముష్టిదైంది. దానికి లోకజ్ఞానం వుంటే, చీరలూ రవికెలూ, నగలూ నాణ్యాలూ బాగానే సంపాదించేది. దాన్ని అందలం ఎక్కించే వాళ్ళూ, దాని కొడుక్కి చదువు సంధ్యలు చెప్పించే వాళ్ళూ తయారయ్యారు. అన్నీ తిరస్కరించి అది ముష్టిదానిలా వెళ్ళిపోయింది!"

సత్యన్నారాయణ తెల్లబోయాడు. విషయం రాధకి తెలిసిపోయినట్టు స్పష్టంగా తెలుస్తోంది. ధైర్యం కూడ గట్టుకున్నాడు.

"ఏమిటి నువ్వనేది? ఎవర్ని గురించి?"

"ఇంకెవర్ని గురించి? ఆ ముష్టిదాన్ని గురించే.

దాని చరిత్రంతా మీకు చెప్పానే! చుట్టూ వేటగాళ్ళు వలలు పన్నుతోంటే జడిసిపోయి పిట్టలా అది ఈ ఇంటికొచ్చింది. ఇక్కడ దానికెలాంటి అన్యాయమూ జరగదని నచ్చచెప్పాను. ఇదొక దేవతల ఆశ్రమం అని మురిసిపోయింది."

"అవును. అయితే యేం? దానికేం లోట యింది?"

"ఎందుకీ నటన? ఎంతకాలం ఇది?"

"రాధా! నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నావు. అది చెప్పిందంతా నమ్మటమేనా? నన్ను మించిన విలువ ఇస్తున్నావా దానికి?"

"నిజంగా మీ కన్నా కొన్ని కోట్ల రెట్లు ఎక్కువ అది నాకు. మిమ్మల్ని పెళ్ళి చేసుకుని, మీకు నా సర్వస్వం అర్పించుకుని, మీ కష్టసుఖాలు నావిగా చూసుకుని మిమ్మల్ని నమ్మి మీతో పదేళ్ళనించీ కలిసి బతుకుతున్నాను. కాని, ఎన్నటికీ మర్చిపోలేని ద్రోహం చెయ్యటానికి ప్రయత్నించారు మీరు. కానీ అది, కష్టంలో నేను చేరదీశానన్న విశ్వాసం కొద్దీ తన బతుకైనా బజారుపాలు చేసుకోటానికి సిద్ధపడిందిగానీ నాకు ద్రోహం తలపెట్టలేదు. ఎవర్ని నమ్మాలి నేను? మనిషినే అయితే ఎవర్ని ప్రేమించాలి? ఎవరు ఎక్కువ నాకు?

ఇంతకాలం నేను దాన్ని ఒక పని మనిషిగా మాత్రమే చూశాను. కడుపునిండా తిండిపెట్టాను. కట్టుకోటానికి గుడ్డలిచ్చాను. కష్టం వస్తే ఆదుకున్నాను. ఇదంతా కనికరంతో చేశాను.

కానీ మీరు చేసిందేమిటి? మీ పక్కలో స్థానం ఇచ్చారు. మీ పక్కలో అర్ధభాగం ఇచ్చి ఆహ్వానించారు. దాని కొడుకుని చదివించి ఉద్ధరించి, పెద్దవాణ్ణి చేస్తానని వాగ్దానాలు చేశారు. దాన్ని ఒప్పించడానికి పడరాని శ్రమలు పడ్డారు. కాలే కడుపు కోసం, పట్టెడన్నం అడుక్కోవటం ముష్టితనమైతే, ఆ ముష్టిదాన్ని కాళ్ళా వేళ్ళా పడి అర్థించటం ఏమౌతుంది? దొరతనమా, మగతనమా?"

సత్యన్నారాయణ పచార్లు సాగించాడు. హఠాత్తుగా ఒకచోట నిలబడి వెటకారంగా అన్నాడు "అది చాలా మంచిదన్నావుగా? ఎంత మంచిదో చూద్దామనీ."

"అసలది అంత మంచిగా ఎందుకుండాలనీ! అంతేగా? ఎలాంటిదని రుజువైంది? చాలా చెడ్డదని రుజువైందా? మీ మగతనానికి దాని ఒళ్ళు ఎరపెట్ట లేదు కదా? అందుకేనా దాన్ని తరిమికొట్టారు? అందుకేనా దానికి నిలవ నీడలేకుండా చేశారు?

క్షయ దగ్గుతో బాధపడే దానికోసం అర్రులు చాచిన మీరు ఆరోగ్యం గురించి ఉపన్యాసం ఇస్తే నోరు మూసుకుని విన్నాను. దానికే లోటూ లేకుండా పోషిస్తానని వాగ్దానాలు చేసి, ఇవ్వాళ మనిషిని మేపటం చాలా కష్టమంటే విని భరించాను. ఎందుకు? ఆ దౌర్భాగ్యురాలి కోసం! ఆ దిక్కులేని పక్షికోసం! కాని చివరికి నేనేం చెయ్యగలిగాను? దాన్ని ఏం రక్షించగలిగాను?"

సత్యన్నారాయణ స్తంభంలా నించున్నాడు తదేకంగా చూస్తూ.

రాధ ఏమీ పట్టనట్టు కిటికీలోంచి చీకట్లోకి చూస్తూ కూర్చుంది.

సత్యన్నారాయణ నెమ్మదిగా దగ్గిరికి వచ్చాడు. "రాధా! ఒక్కమాట చెప్పు. నిన్ను నేను ప్రేమించటం లేదా?"

వినరాని మాట విన్నంత ఛీత్కరించుకుంది రాధ — "ప్రేమ! ఆహా! ఈ ప్రేమని చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించాలి! కవులంతా ముక్త కంఠాలతో గానం చెయ్యాలి! ఆహా హా! ఎంత గొప్ప ప్రేమ! కన్నమ్మ మీరు చెప్పినట్టు ఒప్పుకొని ఉంటే మీ ప్రేమ ఇంకా ద్విగుణీకృతం అయ్యేది!

అంతా నాకు తెలిసిం తర్వాత కూడా 'రాధా! నిన్ను నేను ప్రేమించటం లేదా?' అంటోంటే, ఆహా! మీ సాహసాన్ని మెచ్చుకు తీరాలి" — రాధ మొహమంతా రోషంతో ఎర్రబడిపోయింది.

సత్యన్నారాయణ స్థాణువైపోయి నించున్నాడు. నిజంగా ఆ ఇద్దరి మధ్యా అంత దారుణమైన సంఘటన ఎప్పుడూ జరగలేదు. రాధ కోపిష్టి కాదు. సత్యన్నారాయణా శాంతమూర్తే. ఎప్పుడూ వాళ్ళ అభిప్రాయాలు అంతగా భేదించలేదు. ఇంత జుగుప్సాకరమైన సంభాషణలు జరగలేదు.

సత్యన్నారాయణ మాట్లాడలేక పోయాడు చాలాసేపు. "రాధా! నువ్వు ఎన్ని అన్నా నేను పడాలి. అంత బుద్ధిలేనిపని చేశాను. ఆ మనిషి ఒప్పుకుంటే చాలని ఏమేమో చెప్పాను. అవన్నీ ఉత్త కబుర్లు. దాని అవ

సరం తీరిపోతే నేనేం చెప్పానో కూడా నాకు జ్ఞాపకం వుండేది కాదు."

"భగవంతుడా!" చెవులు మూసుకుంది రాధ, వినలేక. "మీ నీచత్వం ఇన్ని వెర్రి తలలు వేసిందా? మనం సీతా రాములం అనుకుని మన నీడలో తల దాచుకుందా అమాయకురాలు. మిమ్మల్ని నమ్మి ఆ అమాయకురాల్ని మీ దగ్గిర వదిలేసి వెళ్ళిపోయాను. మీ మీద పుట్టెడు విశ్వాసం పెట్టుకుని మీ దగ్గర ఒంటరిగా వున్న ఒక అనాధని వెయ్యి కళ్ళతో రక్షించాలని మీకు తోచనే లేదా? పరాయి ఆడది మీకు తల్లిగా కనిపించకూడదా? తోబుట్టువుగా కనిపించకూడదా? శరీరాల సంబంధం తప్పితే, ఆడ మనిషితో మీకే అనుభూతులూ వుండవా?

పెద్ద మనుషులనీ, బుద్ధిమంతులనీ, పేరు ప్రఖ్యాతులు మీకు! దిక్కు లేని ఒక ఆడదానికి రక్షణ ఇవ్వలేక పోవడం ఎంత సిగ్గుచేటు! దాన్ని పిల్చి మాయమాటలు చెప్పి, నమ్మించి లొంగదీసి, తర్వాత దగా చేసి .... 'అది నాకు తర్వాత గుర్తుంటుందా' అని చెప్తే నేను సంతోషిస్తాననుకుంటున్నారా? కట్టుకున్న భార్యా గుర్తుండదు. పక్కలోకి వచ్చిపోయే ఆడదీ గుర్తుండదు. మరి, మీకు గుర్తుండేది ఎవరు? ఇంత నీచత్వం వుందా మీ మనసులో! అయ్యో! .... " రాధ గోడకి తల ఆన్చి భోరున ఏడ్చింది. ఆ మనిషి, పుట్టిన తర్వాత ఊహ తెలిసిన తర్వాత, అంత బాధతో, అంత అవమానంతో, అంత దుఃఖంతో ఎన్నడూ ఏడవలేదు.

సత్యన్నారాయణ కంపించి పోయాడు "రాధా! నే నెంత పశ్చాత్తాప్పడుతున్నానో నీకు తెలీదు."

రాధ అదిరిపడింది. "పశ్చాత్తాపం! ఎవరికీ? మీకా? అబద్ధాల కింకా అబద్ధాలు జోడించి ఎందుకిలా పతనమైపోతారు? పశ్చాత్తాపం, పగ కోరుతుందా? పశ్చాత్తాపం, మనిషిని, రాక్షసుణ్ణి చేస్తుందా? మీరు పశ్చాత్తాపపడటం నిజమైతే, కన్నమ్మ కాళ్ళ మీద పడి ఏడ్చేవారు. మిమ్మల్ని అంత నీచత్వం నించి రక్షించినందుకు ఆ మనిషికి జీవితమంతా ఋణపడి వుండేవారు. కానీ మీరు చేసిందేమిటి?..."

"రాధా! నిజంగా నాకు కన్నమ్మ మీద కోపం లేదు. అది, జరిగిందంతా నీకు చెప్పేస్తుందేమోనని భయపడ్డాను. దాన్ని ఎంత తొందరగా ఇంట్లోంచి పంపించేస్తే అంత మంచిదనుకున్నాను."

"దాన్ని ఇంట్లోంచి వెళ్ళగొట్టారు. మీరు చేసిన నేరం మీ మనసులోంచి తుడిచి పెట్టుకుపోయిందా? ఒక తప్పు దాచుకోడానికి మార్గం ఇంకో తప్పు చెయ్యటమా? కన్నమ్మకి జీవితం మీద విరక్తి పుట్టి ఆత్మహత్య చేసుకుంటే, ఎవరు బాధ్యులు? మీరుకాదా? పశ్చాత్తాపపడే వాళ్ళు ఇలాగే చేస్తారా?"

సత్యన్నారాయణ మొహం పాలిపోయింది. మాట్లాడటానిక్కూడా ధైర్యం తెచ్చుకోవాల్సి వచ్చింది.

"రాధా! నన్ను... క్షమించు! ఇంతకన్నా నేనేమీ చెప్పలేను. ఇంకేం చెపుతాను?"

రాధ మొహం మీద చెమటని అస్తవ్యస్తంగా తుడుచుకుంది. తిలకం కరిగి మొహంనిండా అంటుకుంది. "తెలుసు. తెలుసు. చివరికి మీరు క్షమించమంటారని నాకు మొదటే తెలుసు. అంతకన్నా నేను చెయ్యగలిగేది ఏముంది? నేనూ మీ దగ్గిర తిండీ బట్టా అడుక్కు తినేదాన్నే! నేనూ మీ దగ్గిర ముష్టిదాన్నే! మీరేం చేసినా భరించడం తప్ప, నేనేం చెయ్యగలను?"

"................................"

రాధ ఒక్కసారి కళ్ళెత్తి అతని మొహంలోకి చూసింది — "కానీ .... ఇలాంటి నమ్మక ద్రోహం నేను చేస్తే? .... ఆ సంగతి మీకు తెలిస్తే? ... ఏం చేస్తారు? నేను చెప్పనా? నన్ను అడగటం వుండదు. నేను చెప్పేది వినటం వుండదు. హఠాత్తుగా కంఠం నలిపి చంపేస్తారు. ఏ కత్తితోనో గుండెల్లో పొడిచి కసి తీర్చుకుంటారు. ఈ సరికి నా శరీరం శ్మశానంలో మసై ... బూడిదై ... గాలిలో కలిసిపోయేది. కానీ మీరు చేస్తే ... 'క్షమించాలి' నేను! ఆడదానికింకేం చేతనౌతుందీ? ... క్షమించకేం చేస్తుంది? క్షమించాలి నేను! ఎంత తేలిగ్గా అడిగారూ! .... కన్నమ్మ తిరస్కరించిన క్షణంలోనే మీ వొంటి మైకం విడిపోవలిసింది. కన్నమ్మ పాదాల మీద పడవలిసింది. జరిగిందంతా నిజాయితీగా నాకు చెప్పవలిసింది. అది నిజమైన పశ్చాత్తాపం అని నమ్మేదాన్ని. అప్పుడు నేను నిజంగానే మిమ్మల్ని క్షమించే దాన్ని....."

సత్యన్నారాయణ అహం దారుణంగా గాయపడింది.

"నేను నిజంగా తప్పు చేశాను. క్షమించమని మళ్ళీ కోరుతున్నాను రాధా!" రెండడుగులు వేసి రాధ దగ్గిరికి వెళ్ళి చేతులు పట్టుకున్నాడు.

రాధ అయిష్టంగా చేతులు విడిపించుకుంది — నన్నింకేమీ అడక్కండి!

నా ఊహల్లో దాంపత్య జీవితం చాలా సున్నితమైంది. పవిత్రమైంది. మన మధ్య ఇప్పుడు అలాంటిదేమీ మిగల్లేదు.

రాధ ధోరణికి సత్యన్నారాయణ తెల్లబోయాడు. ఆశ్చర్యపోయాడు. "రాధా! ఇంత కోపమా?"

రాధ నిష్కర్షగా అంది. "ఇది కోపం కాదు. ఈ సమస్యకి పరిష్కారం. ఇంతకన్నా మనిషిగా నేను ఆలోచించగలిగేదేమీలేదు."

"ఎన్నాళ్ళు అలాగ?"

"జీవితమంతా. నా జీవితమంతా!"

రాధ మాటల్లో గాంభీర్యం అప్పటికి గాని అతనికి అంతుపట్టలేదు. సత్యన్నారాయణ వెర్రి ప్రశ్న వేశాడు. "ఎలా వుండగలం?"

"నే నుండగలను. ఇక నాకీ సంసారంలో ఏముందీ? ఎవరికోసం నా మనసుని చంపుకోవాలి? కానీ మీరుండాలని నేననటం లేదు. మీ ప్రవర్తన గురించి నేను ప్రశ్నించను. ఇప్పుడు నాకా అవసరం లేదు."

"ఒక్క ఇంట్లో ఉంటూ..."

"ఒక్క ఇంట్లో ఉండటం వీలుకాకపోతే ఎవరి దారిన వాళ్ళు వుందాం. ఇన్నాళ్ళూ నాకా అవసరం లేదనుకున్నాను. ఇక నా తిండి ప్రయత్నాలు నేను చేసుకుంటాను."

కోపంగా, నిస్సహాయంగా అన్నాడు భర్త 'మరి పిల్లలు?"

"పిల్లలకేం? పిల్లలు — మీకైనా పిల్లలే, నాకైనా పిల్లలే. ఎక్కడున్నా నిక్షేపంలా వుంటారు."

ఈ రాధ .... తనంటే ఎంతో ప్రేమించే రాధ! తనకెంతో విధేయతగా వుండే రాధ!

"రాధా!" సత్యన్నారాయణ ధీరత్వం జడిసింది.

సత్యన్నారాయణ భర్తృత్వం సిగ్గుపడింది.

ఈ రాధ దగ్గిర నాటకాలు పనికిరావని అర్థమైంది.

కంపించే గొంతుతో అన్నాడు "రాధా! ఇప్పుడే వెళ్తాను. ఎక్కడున్నా సరే, ఊరంతా గాలించి కన్నమ్మని తీసుకొస్తాను! నీ ఎదురుగా ఆ మనిషి కాళ్ళమీద పడి, పాదాలు పట్టుకుని క్షమాపణ కోరుకుంటాను."

సత్యన్నారాయణ నిలబడలేదు. జోళ్ళు వేసుకోకుండా కూడా ఇల్లుదాటి బయటికి వెళ్ళిపోయాడు. బైల్దేరుతూ "నా తప్పుకి నేనే శిక్ష వేసుకుంటాను" అన్నాడు గట్టిగా.

రాధ వారించలేదు. హర్షించలేదు. నమ్మనే లేదు. ప్రతిమలా కూర్చుంది. కాలం సాఫీగా సాగుతున్నంత కాలం అందరూ పెద్ద మనుషులే! రహస్యాలు బైటపడకపోతే మరింత పెద్ద మనుషులు!

"భగవంతుడా! మనసులో సత్య మార్గం తప్పని ఒక్క ప్రేమమూర్తినైనా నువ్వు సృష్టించలేదా? అర్ధాంగి మీద ప్రేమతో బతకగల నిజమైన భర్తని చూపించు! ఆ పుణ్య పురుషుడి పాదాలకు నమస్కరించి ధన్యురాలి నౌతాను."

అది దైవ ప్రార్థనలా లేదు. 'ఆర్తనాదం'లా వుంది!

నిజమైన ప్రేమని దర్శించాలని తపించే రాధ హృదయ కుహరాన్ని చీల్చుకు వచ్చిన ఆర్తనాదంలా వుంది!

[1967 దీపావళి 'జ్యోతి' మాసపత్రికలో] ★

ఈ కథ గురించి:

ఈ కథ ఇప్పుడు చదివితే, ఈ ముగింపు నాకు నచ్చలేదు. 'రాధ, అతన్ని వదిలిపారేస్తే బాగుండేది' అనిపిస్తోంది. ఈ భర్త, జోళ్ళు కూడా వేసుకోకుండా కన్నమ్మకోసం బైల్దే రాడు. అదంతా పశ్చాత్తాపమేనా? పశ్చాత్తాపాలూ, మనుషులు ఉత్తములై పోడాలూ అంత తేలిగ్గా వున్నాయా? ఆ భర్త మొహం, ఆ భార్య మళ్ళీ ఎలా చూస్తుంది? అతనితో మళ్ళీ సంతోషంగా ఎలా మాట్లాడుతుంది? నాకైతే అర్థం కాదు. అతను రాధకి ఎంత అర్థమయ్యాడో రాధకే అర్థం కావాలి. రాధ ఏం చేస్తుందో రాధ ఇష్టం. రాధ సంగతి రాధకే వదిలేశాను.

19-3-2004